PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 13 | విజయవాడ, ఆదివారం 13 ఆగస్టు 2023 | 8+8 పేజీలు+స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 13 August 2023 | Rs



ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

- బెఫి సదస్సు ప్రారంభోత్సవంలో తపన్‌సేన్

లోపలి పేజీలో..



ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్

లోపలి పేజీలో..

మహిళా రిజర్వేషన్‌పై వైఖరి వెల్లడించిన పార్టీ

సిపిఎం ఒక్కటే!

మిగిలిన పార్టీలేవీ ఇప్పటి వరకూ తమ వైఖరి చెప్పడం లేదు

అఫిడవిట్ దాఖలు చేయడానికి ఎందుకు సిగ్గు పడుతున్నారని కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

రాజకీయ పార్టీల విముఖత ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే విషయమై సిపిఎం మినహా ఏ ఒక్క పార్టీ కూడా తమ వైఖరిని స్పష్టం చేయలేదని, చివరికి కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై అఫిడవిట్ దాఖలు చేయలేదని సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు అఫిడవిట్ దాఖలు చేయలేదని ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిలదీసింది. 'మీరు రిప్లై దాఖలు చేయలేదు.. ఎందుకు సిగ్గుపడుతున్నారు?' అఫిడవిట్ దాఖలు చేయడానికి కేంద్రం విముఖతపై ఆరా తీస్తూ అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. కౌంటర్ అఫిడవిట్ సమర్పించేందుకు గత ఏడాది నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గడువు ఇచ్చింది. ఎఎస్‌జి కెఎం నటరాజ్ స్పందిస్తూ "వారు దీన్ని టేబుల్ చేయాలి. టేబుల్‌కి మాండమస్..." అని పేర్కొన్నారు. ఈ బిల్లును ప్రవేశపెట్టాలని పిటిషనర్ డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. వెంటనే జోక్యం చేసుకున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా అది వేరని అన్నారు. "మీరు ఎందుకు అఫిడవిట్ దాఖలు చేయలేదు? మీరు మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనుకుంటున్నారా? లేదా? అని చెప్పండి. ఇది చాలా ముఖ్యమైన సమస్య. ఇది మనందరికీ సంబంధించినది" అని అన్నారు.

పిటిషన్ పై స్పందించడానికి రాజకీయ పార్టీలు తమ 'వైఖరి' తెలపడానికి ముందుకు రావడానికి విముఖత వ్యక్తం చేయడంపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఎవరూ వైఖరి తీసుకోవడానికి ముందుకు రాకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది" అని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు.



జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ చాలా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టే అంశాన్ని చేర్చాయని తెలిపారు. "రాజకీయ పార్టీలు ఏమి చెబుతాయో తెలుసుకోవాలని నేను ఆసక్తిగా ఉన్నాను. సిపిఎం తప్ప ఏ పార్టీ కూడా తమ వైఖరిని స్పష్టం చేయడానికి ముందుకు రాలేదు" అని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. మరోసారి "మీరు సమాధానం దాఖలు చేసి ఉండాల్సింది" అని ఎఎస్‌జి నటరాజ్‌కు, జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. ఎఎస్‌జి కేంద్ర ప్రభుత్వాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. తదుపరి విచారణను ధర్మాసనం అక్టోబర్‌కు వాయిదా వేసింది.

ఎనిమిదేళ్ల క్రితం పార్లమెంట్‌లో రద్దయిన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిల్‌పై 2022 నవంబర్‌లో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. ఆరు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానం, న్యాయ మంత్రిత్వ శాఖ దాఖలు చేయనున్న అఫిడవిట్‌పై స్పందించేందుకు పిటిషనర్‌కు మరో మూడు వారాల గడువు ఇచ్చింది. కాని ఇప్పటికీ కేంద్ర అఫిడవిట్ దాఖలు చేయలేదు.

మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేసే మహిళా రిజర్వేషన్ (రాజ్యాంగం 108 సవరణ) బిల్లు, 2008 అని మరింత అధికారికంగా పిలవబడుతుంది. ఈ ప్రతిపాదిత సవరణ లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టాలని స్పష్టం చేస్తుంది. ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినప్పటికీ, ఇంకా లోక్‌సభ ముందు ప్రవేశపెట్టలేదు.

సిఐడి అదుపులో 'సిఎంఓ' కేసు నిందితులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ)లో పనిచేస్తున్న ఆఫీసర్ల డిజిటల్ సిగ్నేచర్స్‌ను ఫోర్జరీ చేసిన కేసులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సిఐడి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. డిజిపి కార్యాలయంలోని సిఐడి కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిందితులపై క్రైమ్ నెంబరు 10/2023 యుఎస్-420, 465, 468, 471 రెడ్‌విత్ 120-బి ఐపిసి, అండ్ 66-సి అండ్ డి ఐటి యాక్ట్ ఆఫ్ 2000 కింద సిసిపిఎస్, సిఐడి ఎపి మంగళగిరి కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సీనియర్ ఐఎఎస్ అధికారి ముత్యాలరాజు పేషీలో పనిచేస్తున్న మాజీ డిఇఒ కనమర్ల శ్రీను, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి పేషీలో డిఇఓగా పనిచేస్తున్న నలజల సాయిరామ్, ధనుంజయరెడ్డి పేషీలో అటెండర్‌గా పనిచేస్తున్న గుత్తుల సీతారామయ్య, ముత్యాలరాజు పేషీలో డిఇఓగా పనిచేస్తున్న భూక్యా చైతన్య నాయక్, సిఎస్ జవహర్‌రెడ్డి పేషీలో అటెండర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రజాక్ నిందితులని తెలిపారు. తమ విచారణలో ఈ ఐదుగురు నిందితుల పాత్రపై శాస్త్రీయమైన ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. ఫైల్ ప్రాసెసింగ్ చేసేందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించినట్లు సిఐడి పేర్కొంది. వసూలు చేసిన డబ్బుల్లో సాయిరామ్, సీతారామ్, రజాక్ కమీషన్ కింద కొంత మొత్తం ఉంచుకుని శ్రీనుకి రూ.25వేల వరకు ముట్టజెప్పి సిఎంపిలు శ్రీనుతో ఇ-ఆఫీసు నుంచి పనిచేయించే వారన్నారు, శ్రీనును సిఎంఓలో ఉద్యోగం నుంచి తీసివేసిన తర్వాత కూడా బయట నుంచి సిఎంపిలు తయారు చేసి పూనం మాలకొండయ్య పేషీ ఇ-ఆఫీసు ద్వారా దొంగలించిన లాగిన్ పాస్‌వర్డ్‌లు ఉపయోగించి రిసీప్ట్ జనరేట్ చేసి పలు శాఖలకు పంపినట్లు తెలిపారు.



ఐలు రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్

న్యాయమూర్తుల నియామకంలో రిజర్వేషన్లు పాటించాలి

- న్యాయవాదులకు రక్షణ కరువైంది
- ఐలు రాష్ట్ర మహాసభలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి దేవానంద్

ప్రజాశక్తి- గుంటూరు లీగల్

ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయం అమలు కావట్లేదని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళలు వంటి అణగారిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండు రోజులపాటు జరగనున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ రాష్ట్ర మహాసభ శనివారం గుంటూరులోని శుభం కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభ సభకు ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా హాజరైన జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం అన్ని విభాగాలూ సక్రమంగా పనిచేసేలా చేయడంలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమన్నారు. ప్రస్తుత సమాజంలో న్యాయవ్యవస్థ సంకట స్థితిలో ఉందని పేర్కొన్నారు. సామాన్యుల కోసం న్యాయవ్యవస్థ బలంగా నిలబడుతున్నప్పటికీ ఈ వ్యవస్థ ఉనికిని ప్రశ్నించే విపత్కర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజ్యాంగంలో శాఖల వారీగా బాధ్యతలు స్పష్టంగా ఉన్నాయని, కానీ ఒకరి పరిధిలోకి మరొకరి చొచ్చుకొస్తున్నారని తెలిపారు. ఈ విధానం మంచిది కాదన్నారు. దేశవ్యాప్తంగా ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనికి న్యాయమూర్తులు, సిబ్బంది నియామకంలో జాప్యం, న్యాయవ్యవస్థలో మౌలిక వసతులలేమి, కొద్దిమంది న్యాయవాదుల పాత్ర కూడా కారణమని తెలిపారు. సామాన్యుల కేసులు ఏళ్ల తరబడి విచారణకు నోచుకోవట్లేదని, అదే సమయంలో ప్రముఖులు, కార్పొరేట్ల కేసులు మాత్రం త్వరగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ తగ్గించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కృషి చేస్తున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మహాసభలో చర్చించాలని సూచించారు.

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలను, ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. బిజెపి పాలనలో రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణను హరిస్తున్నారని, నిరసన తెలిపే హక్కును నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ఫెడరలిజం,

మిగతా 2లో

ప్రభుత్వ ఉద్యోగులకు హౌసింగ్ సొసైటీల వారీ ఇళ్ల స్థలాలు

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆయా ఉద్యోగ సంఘాల హౌసింగ్ సొసైటీల వారీ ఇళ్ల స్థలాలకు ఎంత మేర భూమి అవసరమవుతుందో పరిశీలన జరపాలని సిసిఎల్ఎ జి సాయిప్రసాద్‌కు సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి సూచించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో శనివారం అధికారులతో ఉద్యోగుల ఇళ్ల స్థలాల అంశంపై సిఎస్ సమీక్షించారు. పది రోజుల్లో ఇదే అంశంపై సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించనున్నారని జవహర్‌రెడ్డి వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానాన్ని తీసుకొచ్చే అంశంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు లేని వారు, ఇళ్లున్నా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు, డ్రైన్లు వంటి వివిధ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని చిన్నచిన్న గుడిసెలు, గుడారాలు వంటివి ఏర్పాటు చేసుకుని జీవనం సాగించే వారిని కట్టడి చేసి, వారికి ప్రభుత్వమే పబ్లిక్ హౌసింగ్ విధానంలో నిర్మించిన ఇళ్లలో నివసించేలా చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో పరిశీలన జరిపి సిఎం సమావేశం నాటికి ఒక నివేదికను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎం కార్యదర్శి ముత్యాలరాజు, గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీశా, సిఆర్‌డిఎ అదనపు కమిషనరు అలీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇహెచ్‌ఎస్ పటిష్టంగా అమలు : సిఎస్

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్)ను మరింత పారదర్శకంగా, పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులతో సిఎస్ సమీక్ష నిర్వహించారు. మరో పది రోజుల్లో ఇహెచ్‌ఎస్ అంశంపై సిఎం సమీక్షిస్తారన్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ.. ఈ పథకంపై ఉద్యోగ సంఘాల నాయకుల నుంచి వచ్చిన ప్రతిపాదనల అమలుకు చర్యలు తీసుకున్నామని, మరికొన్ని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ మరో ఏడాది పొడిగించామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామన్నారు. సెప్టెంబరు చివరి నాటికి అందరికీ ఇహెచ్‌ఎస్ కార్డులు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ ఎగ్జిక్యూటివ్ అధికారి టిఎస్ఆర్ మూర్తి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్యశ్రీ సిఇఒ హరీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చిరుత పంజాకు 'చిన్నారి'బలి

- అలిపిరి నడక దారిలో వెళ్తుండగా ఘటన

జనరిక్ మందులు రాయకపోతే వైద్యులపై కఠిన చర్యలు

- ఎన్ఎంసిఆర్ఎంపి

విశాఖలో అడ్డగోలుగా భూ దోపిడీ

- సిబిసిఎన్‌సి భూముల సందర్శనలో పవన్ కల్యాణ్

లోపలి పేజీలో..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాల్సిందే

- రాష్ట్ర వ్యాప్తంగా కదంతొక్కిన ఉపాధ్యాయులు
- ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ల ఎదుట 12 గంటల నిరసన దీక్ష

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు శనివారం కదంతొక్కారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ల ఎదుట 12 గంటల సామూహిక నిరసన దీక్షలు, ధర్నాలు చేపట్టారు. సిపిఎస్, జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ కావాలి, పెండింగ్ జీతాలు, పిఆర్‌సి, పిఎఫ్, ఎపిజిఎల్ఐ తదితర బకాయిలు వెంటనే చెల్లించాలి, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోన్న జిఒ 117ని రద్దు చేయాలి, 12వ పిఆర్‌సి వెంటనే నియమించాలి, బోధనేతర పనుల నుంచి మినహాయించాలి అని నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసే విధానాలను అవలంభిస్తోందని, అందులో భాగంగానే జిఒ నంబరు 117ని తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా రాష్ట్రంలోని 45 వేల పాఠశాలల్లో 20 వేలకుపైగా పాఠశాలలు మూసివేతకు గురవడం లేదా డి గ్రేడ్ చేయడం ఖాయమన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు 14 వేలకు చేరాయన్నారు. దీనివల్ల ప్రభుత్వ విద్య మరింత కుంటుపడుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, గత ఎన్నికల ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. 2014 జూన్ 2 నాటికి ఉద్యోగంలో ఉన్న కాంట్రాక్ట్ వారందరినీ రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వి.చిరంజీవిరావు పాల్గొని మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో చర్చలు ఉండాలని, చర్చలు లేకుండానే ఈ నాలుగేళ్ల కాలంలో ఏకపక్ష నిర్ణయాలను ప్రభుత్వం చేసిందని విమర్శించారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న 3, 4 తరగతుల విలీన ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం, ఏలూరుల్లో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ



శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎన్.వెంకటేశ్వరరావు

మిగతా 2లో

నైగర్‌ను విడిచిరండి

- **భారతీయులకు విదేశాంగశాఖ సూచన**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైగర్ అధ్యక్షులు మెహ్మద్ బజౌమ్ ప్రభుత్వాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన గ్రూపునకు చెందిన కౌన్సిల్ ఆఫ్ రెసిస్టెన్స్ ఫర్ రిపబ్లిక్ ఫోర్స్‌కు, నైగర్ దేశ సైన్యానికి మధ్య పోరు జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే భారతీయులు ఆ దేశాన్ని విడిచి రావాలని కేంద్ర విదేశాంగశాఖ సూచించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైగర్‌లో గగనతలాన్ని మూసేసినందున, భూమార్గ సరిహద్దుల ద్వారా వచ్చేటప్పుడు భద్రత గురించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నైగర్‌లోని భారతీయులందరూ రాజధాని నియామీలోని భారత రాయబార కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. భారత పౌరులు సహాయం కోసం కార్యాలయంలో ఏర్పాటుచేసిన నెంబరు 22799759975ను సంప్రదించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఎపిఎన్‌ఆర్‌టిఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు నైగర్‌లో ఉన్నట్లయితే వారి గురించి రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లు 8500027678, 8632340678ను సంప్రదించి వివరాలు తెలియజేయాలని తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.


పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అనిత

అనిత అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - నక్కపల్లి, యలమంచిలి (అనకాపల్లి)

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వెళ్తుండగా వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఆమెను పోలీసులు అడ్డగించారు. సిఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఆమెను కారులోనే నిర్బంధించారు. ఈ ఘటనపై అనిత తీవ్రంగా మండిపడ్డారు. పాయకరావుపేటలోని తన పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి వెళ్తుంటే ఎందుకు అడ్డగిస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. పాయకరావుపేటలో ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాబూరావు శంకుస్థాపన చేస్తున్నారని, మీరు అక్కడకు వెళ్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు ఆమెకు చెప్పారు. తాను పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యేనని, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నానని, పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నాను అని, ఇలా అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అనితను పోలీసులు అడ్డగించారన్న విషయం తెలుసుకున్న టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓ దశలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అనితను అరెస్టు చేసి యలమంచిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆమెను విడిచిపెట్టారు.

దేశగాయాలపై మౌనంగా ఉంటే

రాచపుండుగా మారే ప్రమాదం

- **జోకర్లను లీడర్లను చేస్తే చూడాల్సింది సర్కస్‌నే**
- **సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆవిర్భావ సభలో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్**


సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రాజ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'దేహానికి గాయాలైతే మౌనంగా ఉన్నా అవి కొద్ది కాలం తర్వాత మానిపోతాయి. దేశానికి తగులుతున్న గాయాలపై మౌనంగా ఉంటే అది రాచపుండుగా మారి కబలించివేస్తుంది. ఇప్పుడు మనం అదే పరిస్థితిలో ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో సమూహ ఏర్పడటం మంచి పరిణామం. అందరూ మేల్కొని దేశాన్ని రక్షించుకోవాలి' అని సినీనటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆవిర్భావ సభ జరిగింది. పలు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు అయిన కాత్యాయని విద్మహే, స్కైబాబా, పసునూరి రవీందర్, సంగిశెట్టి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షత వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. 'సమాజం నేడు సందిగ్ధ పరిస్థితుల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ప్రతిభ ఉంటేనే రచయితలు, కవులు కాలేరన్నారు. చంద్రుడు, పూలు, నక్షత్రాలు, ప్రకృతి మీద కవితలు రాయొచ్చు కానీ, మనం వెళ్తున్న దారిలో రక్తం కనిపిస్తే దానిపైనా రాయాల్సిన బాధ్యతా కవులపై ఉందని పేర్కొన్నారు. వాటిని డాక్యుమెంట్ చేయాల్సిన అవసరమూ ఉందని నొక్కి చెప్పారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో నువ్వా? నేనా? అనే డిబేట్ కాంపిటేషన్, రాజకీయం తప్ప వంద రోజులుగా మండిపోతున్న మణిపూర్ గురించి మాట్లాడిదేం లేదన్నారు. మణిపూర్ గురించి ప్రస్తావిస్తే బెంగాల్, హర్యానా అంటూ అనవసర విషయాలను ప్రస్తావించి పెద్దగా చెప్పుకోవడానికేం లేదనడం శోచనీయమన్నారు. దేశంలో రైళ్లను ప్రారంభించుకుంటూ పోతున్న స్టేషన్ మాస్టర్‌ను మణిపూర్ వెళ్లే రైలు ఏ సమయానికి వస్తుందని అడిగితే సమాధానమే లేదన్నారు. జోకర్లను లీడర్లుగా చేస్తే మనం చూడాల్సింది వారి సర్కస్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. నేతలను ఎన్నుకునే విషయంలో ప్రజల్లో మార్పు రావాలని ఆకాంక్షించారు. మన బొటనవేలు తెగిపోతే ఏం కాదు..అదే ఏకలవ్యుడు బొటన వేలు తెగిపోతే అది సమాజానికి నష్టమనీ, అలా జరగకుండా చూడాలని అన్నారు. 70 ఏళ్ల తర్వాత తర్వాత దేశం ఎక్కడున్నది? అసలేం జరుగుతున్నది? దానికి మూలకారణమేంటి? ప్రజల్ని చైతన్యపర్చటానికి మనం చేయాల్సిందేంటి? అనే వాటిపై ప్రశ్నించే, ఆలోచించే సమయం వచ్చిందనీ, ముఖ్యంగా కళాకారులు, ప్రజ్ఞావంతులు, రచయితలపై ఆ బాధ్యత ఎక్కువగా ఉందన్నారు. మతం, కులం దేశానికి చాలా ప్రమాదకరమని, వాటిని విసర్జించాలని పిలుపునిచ్చారు. ఈ సెషన్‌కు ప్రముఖ కవి యాకూబ్ సమన్వయకర్త వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్, ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ పద్మజా షా, ప్రొఫెసర్ భంగ్యా భూక్యా తదితరులు ప్రసంగించారు.

అన్ని రంగాల్లో రాష్ట్రం వెనుకంజ

- **ఐఆర్‌ఎపి రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు**

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకంజలో ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఐఆర్‌ఎపి (ఇన్‌స్టిట్యూట్ పర్ రీసెర్చ్ ఆన్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో కర్నూలులో బ్రహ్మరెడ్డి హస్పిటల్ సెమినార్ హాల్లో సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. తొలిరోజైన శనివారం పలు అంశాలపై చర్చించారు. 'రాజకీయ ఆర్థిక అభివృద్ధి' అనే అంశంపై డాక్టర్ వంశీ, వకలా భరణం సురేంద్ర ప్రసాద్, చిన్న రంగయ్య మాట్లాడారు. భూ సమస్యల అంశంపై వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆదివాసుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి అజయ్ కుమార్, రాయలసీమ ప్రాంత అభివృద్ధిపై రాయలసీమ సాగునీటి ఉద్యమ నాయకులు బొజ్జ దశరథరామిరెడ్డి, ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి-రాజకీయాలపై హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రవితేజ రాంబార్కి, దక్షిణ కోస్తాంధ్ర అభివృద్ధి-రాజకీయాలపై నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి ప్రసంగించారు. ఆయా ప్రాంతాల వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని వక్తలు తెలిపారు.

అసైన్డ్ భూములన్ని పెద్దల గుప్పిట్లో

రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ భూములన్నీ పెద్దల గుప్పిట్లోనే ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. అభివృద్ధి పేరుతో జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల హయాంలో అసైన్డ్ భూములను పేదల నుంచి దౌర్జన్యంగా తీసుకున్నారని విమర్శించారు. ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదని, బడా కార్పొరేట్ సంస్థలకు ఆ భూములను కట్టబెట్టారని తెలిపారు. బడా నేతలకు అనుకూలంగా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించిందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని పేదలకు భూములను పంచాలని డిమాండ్ చేశారు.

డిఎస్‌సి-98 అభ్యర్థులకు న్యాయం చేయాలి

- **పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిఎస్‌సి-98 అభ్యర్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేయాలని డిఎస్‌సి పోస్టుల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ మెరిట్ పద్ధతిలో 4,072 మంది అభ్యర్థులకు మాత్రమే నియామకాలు చేసిందన్నారు. ఈ నిర్ణయం వల్ల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఒసిల్లోని పేద విద్యార్థులందరూ నష్టపోయారని తెలిపారు. మిగిలిన 2,682 పోస్టులను దళిత, గిరిజన, మైనార్టీ, బిసి, ఒసి, వికలాంగులు, మహిళలకు కేటాయించాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. డిఎస్‌సి పోస్టుల సాధన పోరాట కమిటీ చేస్తున్న ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తరగతుల వారు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మిగిలిన ఉద్యోగ నియామకాలపై అభ్యర్థుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 16న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, పొదిలి రమణ, రమేష్, రత్నం, మేరి సుహాసిని, మోహనరావు, కోమలి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో అడ్డగోలుగా భూ దోపిడీ

- **వివాదాస్పద సిబిసిఎన్‌సి భూముల సందర్శనలో పవన్ కల్యాణ్**

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, పెందుర్తి (విశాఖపట్నం)

విశాఖలో అడ్డగోలుగా భూ దోపిడీ జరుగుతోందని, అధికార బలాన్ని ఉపయోగించి వైసిపి ఎంపి ఎంవివి.సత్యనారాయణ ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. పవన్ చేపట్టిన వారాహి విజయ యాత్ర విశాఖలో శనివారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ఆయన సిరిపురం జంక్షన్ వద్దనున్న సిబిసిఎన్‌సి భూములను భారీ భద్రత నడుమ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సిఎం జగన్మోహన్‌రెడ్డి, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణపై మండిపడ్డారు. ప్రజల ఆస్తులు ప్రజలకు దక్కే వరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. క్రిస్టియన్ ట్రస్టుకు చెందిన సిబిసిఎన్‌సి భూముల్లో ఎంపి ఎంవివి.సత్యనారాయణ భారీ స్థాయి నిర్మాణాలు చేపట్టడాన్ని జనసేన తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ఆ భూములను అధికార బలంతో చేజిక్కించుకుని ఎంపి నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. విశాఖ ప్రజల ఓట్లతో గెలిచి ఇక్కడ భద్రత లేదన్న సాకుతో వ్యాపారాలు చేసుకునేందుకు హైదరాబాద్ పారిపోతానని ఎంపి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంత చేతగాకపోతే ఎంపి పదవికి రాజీనామా చేసి హైదరాబాద్ వెళ్లిపోవాలని సూచించారు. క్రైస్తవుల భూముల్లో చేపడుతున్న నిర్మాణాలకు వాస్తు పేరుతో అధికారాన్ని ఉపయోగించి సిరిపురం రోడ్డును మూసివేయించడం వైసిపి నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. తెలంగాణలో మాదిరిగానే ఇక్కడా ప్రజల ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌ట్యాక్స్ పేరుతో ఎలా దోపిడీ చేస్తోందో ఓ లారీ డ్రైవర్ పవన్‌కు వివరించగా ఆ విషయమై గాజువాకలో జరిగే బహిరంగ సభలో మాట్లాడతానని అన్నారు.


సిబిసిఎన్‌సి భూములను పరిశీలిస్తున్న పవన్

వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శ

ఇటీవల వార్డు వలంటీరు చేతిలో వరలక్ష్మి హత్యకు గురవ్వడంతో ఆమె కుటుంబాన్ని పవన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది వలంటీర్లు అసాంఘిక శక్తులుగా మారి నేరాలకు తెగబడుతున్నారన్నారు. హత్య జరిగి పది రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకూ వైసిపి నాయకులు ఎవ్వరూ పరామర్శకు రాకపోవడం శోచనీయమన్నారు. వలంటీర్లపై పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో వారు రెచ్చిపోతున్నారని విమర్శించారు. ఎపిలో మహిళల అదృశ్యంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

అడుగడుగునా ఆంక్షలు

పవన్ పర్యటనపై అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించారు. ఆయన వెంట జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రావడంతో నోవాటల్ నుంచి సిబిసిఎన్‌సి భూముల వరకూ పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, సిరిపురం జంక్షన్, తదితర చోట్ల పవన్ కాన్వాయ్‌ను పోలీసులు కాసేపు నిలువరించారు.

రద్దైన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

- **పల్నాడు జిల్లాలో కొనసాగుతున్న లోకేష్ పాదయాత్ర**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/పెదకూరపాడు

వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శనివారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని గారపాడు, లగడపాడు, పెదకూరపాడు, లింగంగుంట్ల, పొడపాడు మీదుగా తాడికొండ మండలం శిరిపురం గ్రామంలో కొనసాగింది. రైతులు, దళితులు, వివిధ తరగతుల ప్రజలతో లోకేష్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ముందుగా గారపాడు గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆయకట్టు చివరి పొలాలకు నీరు అందడం లేదని, నీరందే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చివరి భూములకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నీటిపారుదల రంగాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ముఖాముఖి సమావేశంలో పలువురు దళితులు మాట్లాడుతూ.. దళితవాడల్లో కనీస సదుపాయాలు లేవని, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు లేకపోవడం వల్ల అభివృద్ధి జరగడం లేదని, విదేశీ విద్యా పథకం రద్దు చేయడం వలన దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా నిధులు రాక విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి రాగానే వైసిపి రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు నకిలీ విత్తనాలతో తీవ్రంగా దెబ్బతింటున్నారన్నారు. ముస్లిములపై దాడులు అధికమయ్యాయని, ఎస్‌సిల మాదిరిగా ముస్లిములకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని రక్షించాలని పలువురు ముస్లిములు లోకేష్‌ను కోరారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.


పల్నాడు జిల్లా పెదకూరపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేష్

లగడపాడులో స్వల్ప ఉద్రిక్తత

పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడులో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తమ పార్టీ జెండాలతో వైసిపి కార్యకర్తలు నినాదాలు చేస్తూ టిడిపి వారిని కవ్వించడంతో ఇరు గ్రూపుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు గ్రూపుల వారికి సర్దిచెప్పి పంపించారు.

లక్షిత మృతి బాధాకరం : లోకేష్

అలిపిరి నడకదారిలో చిరుత దాడిలో లక్షిత మృతి బాధాకరమని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రూర జంతువుల నుంచి జనానికి రక్షణ కరువైందని విమర్శించారు.

130 మందితో సోషల్ మీడియా సెంటర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే ప్రకటనలు, తప్పుడు ఆరోపణలు చేసే వారిని గుర్తించేందుకు ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లను అనుసంధానం చేస్తూ, అటువంటి వారిని మానిటరింగ్ చేసేందుకు 130 మంది సభ్యులతో సోషల్ మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సెంటర్‌లో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ స్పెషలిస్టులను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎపి పోలీస్ వ్యవస్థ విజయవాడలో ఒక సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక సిఐ, ఒక ఎస్‌ఐ, ఆరుగురు కానిస్టేబుల్స్‌తో ఎస్‌పికి అనుసంధానం చేస్తూ, వారికి ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లు ఇచ్చి మానిటరింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ చిత్రంగా 'సీతారామం'



గతేడాది విడుదలై ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న 'సీతారామం' సినిమా తాజాగా ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కించుకుంది. 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. మెల్‌బోర్న్ వేదికగా ప్రారంభమైన ఈ వేడుకలు ఈ నెల 20 వరకు జరగనున్నాయి. తొలి రోజైన శుక్రవారం పలు విభాగాలకు సంబంధించిన అవార్డులను టీమ్ ప్రకటించింది. బాలీవుడ్‌కి నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్, హీరో కార్తీక్ ఆర్యన్, నటి మృణాల్ ఠాకూర్, నటుడు విజయ్ వర్మ తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ సిరీస్‌గా 'జూబ్లీ', ఉత్తమ డాక్యుమెంటరీగా 'టు కిల్ ఏ టైగర్' నిలిచాయి. రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) బెస్ట్ యాక్టర్- ఫిమేల్, మోహిత్ అగర్వాల్ (ఆగ్రా) బెస్ట్ యాక్టర్- మేల్, పృథ్వీ కొననూర్.. బెస్ట్ డైరెక్టర్, మృణాల్ ఠాకూర్.. డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. బెస్ట్ పెర్ఫామెన్స్ సిరీస్ విభాగంలో రాజశ్రీ దేశ్‌పాండే (ట్రయల్ బై ఫైర్), విజయ్ వర్మ (దహాడ్) అవార్డు పొందారు.


నివాళులర్పిస్తున్న ప్రభాకర్,జ్యోతి,రాములు,జగదీష్ తదితరులు

నవతెలంగాణ మాజీ సిజిఎం పివి శ్రీనివాస్ హఠాన్మరణం

- **భద్రాచలానికి భౌతికకాయం- నేడు అంత్యక్రియలు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ దినపత్రిక మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ పివి శ్రీనివాస్ (50) హఠాన్మరణం చెందారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నారాయణగూడలోని తన నివాసంలో తీవ్రమైన గుండెపోటు రావటంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ఆయనకు భార్య స్వర్ణ జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పివి మరణం పట్ల సిపిఎం, నవతెలంగాణ సంస్థ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిగా, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా, ఆ సంఘానికి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, అనంతరం ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. పట్టణ పేదల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్‌గా సేవలందించారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి 2020 ఫిబ్రవరి వరకూ నవతెలంగాణ సిజిఎంగా పని చేశారు. ఆయన భార్య స్వర్ణ జ్యోతి భద్రాచలం జిల్లాలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ యుటిఎఫ్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

భౌతికకాయానికి నవతెలంగాణ పత్రిక సిజిఎం పి.ప్రభాకర్, ఫీచర్స్ ఎడిటర్ కె ఆనందాచారి, పలువురు మేనేజర్లు, బోర్డు సభ్యులు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. అనంతరం పివి భౌతికకాయాన్ని బాగ్‌లింగంపల్లిలో గల ఎమ్‌హెచ్ భవన్‌కు తరలించారు. అక్కడ ప్రభాకర్ అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, టిపిఎస్‌కె కన్వీనర్ జి రాములు, ప్రభాకర్ కలిసి పివి భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి ఘన నివాళులర్పించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంఘాలకు, పార్టీకి, నవ తెలంగాణకు పివి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఉద్యమాల్లో సమన్వయంతో కలిసి పని చేశామని తెలిపారు. నవతెలంగాణ ఇన్‌ఛార్జి ఎడిటర్ రాంపల్లి రమేశ్, ఎస్‌వికె బాధ్యులు కె సోమయ్య, జి బుచ్చిరెడ్డి, సోషల్ మీడియా బాధ్యులు జగదీశ్, నవతెలంగాణ పూర్వ బోర్డు సభ్యులు జి రాజకుమారి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబూరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య, వరప్రసాద్, ఇన్సూరెన్స్ రంగం సీనియర్ నాయకులు కెఎస్‌ఎన్ రాజు, ఎపి ప్రజా సంఘాల బాధ్యులు బాలకాశి, నూర్ మహ్మద్, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, నవతెలంగాణ సిబ్బంది, ఉద్యోగులు పివికి ఘన నివాళులర్పించారు.

పివి మృతికి ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, ఎడిటర్ బి తులసీదాస్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, నవతెలంగాణ పూర్వ సంపాదకులు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, కార్యదర్శి అనగాని వెంకటేశ్ సంతాపాన్ని తెలిపారు. సంతాప సభ అనంతరం పివి భౌతికకాయాన్ని భద్రాచలానికి తరలించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ సంస్థల నిర్వీర్యాన్ని అడ్డుకుంటాం



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యాన్ని పోరాటాలతో అడ్డుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 912వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఆర్‌ఎం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. స్వాతంత్ర్యం తరువాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని మోడీ సర్కారు గుర్తెరగాలన్నారు. ఉత్తరాంధ్రలో వేలాది మందికి స్టీల్‌ప్లాంట్ వల్లే ఉద్యోగాలు దక్కాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడిపే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మురళి, బాషా, రాజు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ఫ్యాప్టో పోరాటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ వద్ద సామూహిక నిరసన దీక్షలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలను విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో తీసుకొచ్చిన 117 జిఒ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 181 పాఠశాలలు మూతబడ్డాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మూడు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లారని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలు ధర్నా చౌక్ వద్ద సామూహిక దీక్షలో ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్ కె.ప్రకాష్‌రావు పాల్గొని ప్రసంగించారు. అనంతపురం, కడప, అన్నమయ్య, నెల్లూరు, పల్నాడు, మచిలీపట్నం, అమలాపురం కలెక్టరేట్ల వద్ద, విజయవాడలో ధర్నా చౌక్, విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం, అనకాపల్లిలో నెహ్రూ చౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్వతీపురం, పాడేరులో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

ఫ్యాప్టో అభినందనలు

రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ఆందోళనలు విజయవంతమయ్యాయని ఫ్యాప్టో చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.


జండా ఆవిష్కరణ చేస్తున్న ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

న్యాయమూర్తుల నియామకంలో రిజర్వేషన్లు పాటించాలి

మొదటి పేజీ తరువాయి

లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయన్నారు. శాసన శాఖ విఫలం అయినప్పుడు న్యాయవ్యవస్థ తన పాత్ర పోషించాలని, మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో ఈ విషయం స్పష్టమైందని తెలిపారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా ఐలు జెండాను సుంకర రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ప్రారంభ సభలో ఐలు జాతీయ ప్రధాన కార్యదర్శి పి.వి.సురేంద్రనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, ఐఎఎల్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు, తెలంగాణ రాష్ట్ర ఐలు అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి సత్యనారాయణ, పార్థసారథి, ఎపి బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, సభ్యులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది డి రాజగోపాల్ తదితరులు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు గత మహాసభ నుండి ప్రస్తుత మహాసభ వరకూ నిర్వహించిన కార్యక్రమాలపై నివేదిక ప్రవేశపెట్టగా, 13 ఉమ్మడి జిల్లాల నుండి హాజరైన ప్రతినిధులు చర్చించారు.

మద్యంపై వెనక్కి?

- మళ్లీ వేలం పాటల విధానం
- అధికార పార్టీ నేతల నుంచే డిమాండ్



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది. గతంలో మాదిరిగానే వేలం పాటల ద్వారా దుకాణాలను ఖరారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. అధికారపార్టీ నేతల నుంచే దీనికోసం ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిసింది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 2,934 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి కాలపరిమితి వచ్చే నెల 30వ తేదీతో ముగియనుంది. ఇక అక్టోబర్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే కొత్త ఏడాది నుంచి ఉన్న పాలసీనే కొనసాగిస్తారా, లేక మళ్లీ వేలం పాటల ద్వారా ప్రయివేటు వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పాత విధానంలోకి వెళ్తే బాగుంటుందని అధికార పార్టీకి చెందిన వారే డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రతిపక్షాలకు చెందిన వారు కూడా ఇదే కోరిక వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేలం పాటల ద్వారా దుకాణాలు నిర్వహించే సమయంలో ఎక్కువ దుకాణాలను రాజకీయ నేపథ్యం ఉన్న వారే దక్కించుకున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వమే షాపులు నిర్వహిస్తుండటంతో వీరికి ఆర్థిక వనరులు తగ్గాయి. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మళ్లీ వేలం పాటల ద్వారా దుకాణాల నిర్వహణ అంశం తెరపైకి వస్తోంది. అలా అయితేనే కొంతమేరకైన ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం సాధ్యమవుతుందని వీరు అంటున్నారు. అధికారపార్టీకి చెందిన కొందరు ప్రభుత్వంలో పెద్దలను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఇదే విషయాన్ని తీసుకుపోవడానికి ప్రయత్నిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే నిర్ణయమే కీలకం కావడంతో ఆయన్ను ఎలాగైనా ఒప్పించడానికి ఈ లాబీ ప్రయత్నిస్తోందని తెలిసింది. కొంతమంది ప్రభుత్వంలోనివారు కూడా ఈ డిమాండ్‌పై సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల నేతల ఆదాయం సంగతి ఎలా ఉన్నా, సంక్షేమ పథకాలకు కావాల్సిన నిధులు ఒకేసారి సమకూరుతాయని అంటున్నారు. విధాన మార్పు చేయాల్సి వస్తే దీనిని శాసనసభలో పెట్టాల్సి ఉంటుందని ఒక అధికారి అభిప్రాయపడ్డారు. సిఎం సానుకూలంగా స్పందిస్తే వచ్చే నెలలో జరగనున్న వర్షాకాల సమావేశాల్లో మద్యం పాలసీ మార్పు బిల్లును కూడా పెట్టే అవకాశం ఉంది.



స్వాగతం పలుకుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

శ్రీవారి సేవకు జస్టిస్ భూటాన్ రామకృష్ణ

ప్రజాశక్తి -తిరుమల

శ్రీ వారి సేవకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూటాన్ రామకృష్ణ గవాయ్ శనివారం తిరుమల వచ్చారు. శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో ఆయనకు ఎపి హైకోర్టు సిజె జస్టిస్ ధీరాజ్ సింగ్, టిటిడి చైర్మన్ కరుణాకరరెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. జస్టిస్ భూటన్ రామకృష్ణ వసతి గృహంలో రాత్రికి విశ్రాంతి తీసుకొని ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే ఉపేక్షించం

- డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం (నరసాపురం)

రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసేలా రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో డిఎస్‌పి కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవానికి శనివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో డిజిపి మాట్లాడుతూ.. పుంగనూరులో పోలీసులపై అల్లరి మూకల దాడులను ఖండించారు. ఈ కేసులో ఇప్పటి వరకు సుమారు 80 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పోలీసులపై ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పుంగనూరులో దాడికి పాల్పడింది స్థానికులా? లేక బయట నుంచి వచ్చిన వ్యక్తులా? అనేదానిపై లోతైన విచారణ చేస్తున్నామని చెప్పారు. పోలీసు వ్యవస్థ అందరి కోసం పనిచేస్తుందని, రాజకీయ పార్టీలు గుర్తుంచుకుని తమకు సహకరించాలని కోరారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కొత్త ఒరవడి సృష్టించామని, 1.40 లక్షల మంది మహిళలు దిశా యాప్‌లో రిజిస్టర్ అయ్యారని తెలిపారు. ఇప్పటి వరకు 27 వేల మంది మహిళలు ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో 20 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయని వివరించారు.

వెంకటరమణపల్లి ఘటన దుర్మార్గం : సిపిఎం

- గ్రామంలో బృందం పర్యటన

ప్రజాశక్తి- గోరంట్ల రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లి గ్రామంలో వడ్డెర సామాజిక తరగతిపై వైసిపి మద్దతుదారులు దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ అన్నారు. తక్షణం పోలీసులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంకటరమణపల్లి గ్రామాన్ని శనివారం ఉదయం సిపిఎం జిల్లా నాయకత్వం శనివారం సందర్శించింది. ఘటనపై వాస్తవాలు తెలుసుకోవడానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇఎస్.వెంకటేష్, పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్పతో కలిసి నాయకత్వ బృందం గ్రామానికి వెళ్లింది. బాధిత కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులతో నాయకులు మాట్లాడారు. అధికార పార్టీ అండదండలతో వడ్డెర కుటుంబ సభ్యులపై దాడి జరిగినట్లు గుర్తించారు. అనంతరం మీడియాతో ఇంతియాజ్ మాట్లాడుతూ.. వైసిపి అండదండలతోనే పెత్తందారులు దాడులకు తెగబడ్డారన్నారు. కర్రలు, బీరు సీసాలతో పాశవికంగా దాడి చేసి గాయపర్చారని తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, నాలుగు నెలల పసికందుపై కూడా దాడి చేశారన్నారు. ఈ దాడిలో నలుగురికి కాళ్లు విరిగాయని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టాలని, దాడికి పాల్పడిన చెవిరెడ్డి, హనుమంతరెడ్డి, హరినాథ్ రెడ్డి, మద్దిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శంకర్ రెడ్డితో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన యువకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద రెండు సెంట్ల స్థలాన్ని వడ్డెర కుటుంబానికి అందజేయాలని కోరారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

ఎసిబికి పట్టుబడ్డ విద్యుత్ ఎడిఇ

ప్రజాశక్తి-బాపట్ల

లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఎడిఇ ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి అధికారుల సమాచారం మేరకు.. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన ఓ ఐస్ కంపెనీకి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు యజమాని వద్ద నుంచి చెరుకుపల్లి విద్యుత్ ఎడిఇ లంచం డిమాండ్ చేశాడు. రూ.1.50 లక్షలు ఇస్తేనే కనెక్షన్ ఇస్తానని తేల్చి చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఐస్ ఫ్యాక్టరీ యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి అదేశాల మేరకు ఎడిఇకి రూ.70 వేలు లంచం ఇస్తుండగా గుంటూరు ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎడిఇపై కేసు నమోదు చేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ తదితర నూతన కార్యవర్గం

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా కృషి

- ఎపిజిఇఎఫ్ చైర్మన్‌గా వెంకటరామిరెడ్డి ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిజిఇఎఫ్)చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ఎపిజిఇఎఫ్ రాష్ట్ర కార్యవర్గానికి గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా వెంకటరామిరెడ్డితో సహా 56 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రెటరీ జనరల్‌గా అరవపాల్, ట్రెజరర్‌గా ఎస్.రామకృష్ణ ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా పోలంకి శ్రీనివాసరావు, కో-చైర్మన్లుగా లెక్కల జమాల్‌రెడ్డి, దివాకర్, చంద్రయ్య, గిరిప్రసాద్, చిరంజీవి, అశోక్‌కుమార్‌రెడ్డిని ఎన్నుకోబడ్డారు. నూతన కార్యవర్గానికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందించి, ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ..కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ 2014 జూన్ రెండు నాటికి ఐదేళ్ల సర్వీసు నిబంధనను సడలించి, అప్పటి దాకా పనిచేస్తున్న అందర్నీ క్రమబద్ధీకరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. త్వరలో గుంటూరులోనే రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల సహాయ అధికారిగా జి.వందనబాబు వ్యవహరించారు. ఎపిజిఇఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాస్కర్‌రెడ్డి, ఎం.దేవపాల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎపిజిఇఎఫ్ గౌరవ చైర్మన్లుగా ఎమ్మెల్సీలు టి.కల్పలత, రామచంద్రారెడ్డి, జాక్టో చైర్మన్ జాలిరెడ్డిని సలహాదారుగా ప్రకటించారు.

వ్యూహం సినిమాను అడ్డుకుంటాం : టిడిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తీస్తున్న వ్యూహం సినిమాను అడ్డుకుంటామని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్మను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గతంలో లక్ష్మీస్ ఎన్‌టిఆర్ సినిమా తీసి దురుద్దేశాలు ఆపాదించాడని విమర్శించారు. సిఎం జగన్ మోచేతి నీళ్లు తాగి తాజాగా 'వ్యూహం' అనే మరో సినిమా తీస్తున్నాడని తెలిపారు. గొప్ప నీతిమంతుడులా సినిమా తీస్తావా? అని జగన్‌ను ప్రశ్నించారు. 60 లక్షల క్రియాశీలక సభ్యత్వం ఉన్న టిడిపిని సినిమాలో తూలనాడితే దుష్పరిణామాలు తప్పవన్నారు. రామ్ గోపాల్ వర్మను ఎపి నిర్మాతల మండలి దూరంగా పెట్టాలని కోరారు. సెన్సార్ బోర్డు అధికారులు వ్యూహం సినిమా బయటకు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలా కాకుండా థియేటర్లలో విడుదల చేస్తే ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు.

జియో నుంచి రెండు స్మార్ట్‌ఫోన్లు..!

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో కొత్తగా రెండు 5జి స్మార్ట్‌పోన్లను విడుదల చేయనుందని తెలుస్తోంది. ఈ నెల 28న జరగనున్న రిలయన్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో వీటిపై జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటన చేస్తారని సమాచారం. ఆ ఫోన్లకు ఇప్పటికే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) సర్టిఫికెట్ పొందినట్లు రిపోర్టులు వస్తున్నాయి. ఆయా ఫోన్ల ధరలు రూ.8 వేల నుంచి రూ.12వేల మధ్య ఉండొచ్చని అంచనా.

స్వాతంత్రోద్యమంలో తెనాలి ప్రస్థానం చెరగనిది

క్విట్ ఇండియా ఉద్యమ అమరుల సంస్మరణ సభలో మంత్రి అంబటి

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

దేశ స్వాంతంత్రోద్యమంలో తెనాలి ప్రస్థానం చెరగని ముద్ర వేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తెనాలి రణరంగ చౌక్‌లోని క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన స్థూపాల వద్ద స్వతంత్ర సమరయోధుల సంస్మరణ సభ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి రణరంగ చౌక్ వరకు భారీ ర్యాలీగా వచ్చి అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అంబటి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తెనాలి ప్రాంతం కళలకు కాణాచి అని, చైతన్యవంతమైన ప్రాంతమని తెలిపారు.

అందుకే స్వాతంత్ర్య ఉద్యమంలో గుంటూరు, కృష్ణా జిల్లాలు గణనీయమైన పాత్ర వహించాయన్నారు. 1942 తెనాలిలో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ పోరాటంలో పోలీసుల కాల్పులలో ఏడుగురు బలిదానం కావడం భారతదేశ వ్యాప్తంగా సంచలనం సష్టించిందన్నారు. వారి త్యాగాలను భావితరాలకు తెలియజేసేందుకు 1959లో నాటి శాసన సభ్యులు ఆలపాటి వెంకటరామయ్య అమరవీరుల స్తూపాలను నిర్మించి నాటి ఆంధ్ర, తమిళనాడు ముఖ్యమంత్రులతో ఆవిష్కరింపజేశారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం సంస్మరణ దినోత్సవం జరుపుకుంటూ నేటి తరానికి తెలియజేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి, ఎమ్మెల్యే శివకుమార్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, తెనాలి మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలీదా నసీమ్ దుస్సాలువాతో సత్కరించి మెమోంటోలను అందించారు.



తెనాలిలోని రణరంగ చౌక్ వద్ద అమరుల స్థూపాలకు నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి తదితరులు

నారీ వ్యతిరేక చరిత్ర నీదే

సిఎంకు 'అచ్చెన్న' బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'నారీ వ్యతిరేక చరిత్ర నీదే' అని సిఎం జగన్‌నుద్దేశించి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. చంద్రబాబు ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రూ.5 లక్షల వరకు వర్తింపజేసిన సున్నా వడ్డీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతానని జగన్ మేనిఫెస్టోలో, ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక రూ.3 లక్షలకే కుదించి మహిళల్ని మోసం చేశారని విమర్శించారు.

వివేకానందరెడ్డి హత్య చేసులో దోషులను జగన్ రక్షిస్తున్నారని, చెల్లికి తండ్రి ఆస్తిలో సమాన వాటా ఎగనామం పెట్టారని ఆరోపించారు. పేదల పేరుతో అప్పు చేసి మింగేయడం వల్లే ఆర్థిక సంక్షోభం నెలకొన్నదన్నది వాస్తవం కాదా? అని పేర్కొన్నారు. సెంటు పట్టా పేరుతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన 20 వేల అసైన్‌మెంట్ భూముల్ని బలవంతంగా లాక్కుని సామాజిక న్యాయం గొంతు కోశారని ఆరోపించారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని వైసిపి నేతలకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు, జెసిఎస్ కో-ఆర్డినేటర్లతో శనివారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరించారు. సిఎం జగన్ పాలన పట్ల ప్రజల్లో అభిమానం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఓటర్ల లిస్టు ఫైనలైజేషన్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగే కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్స్ ద్వారా కసరత్తు పూర్తి చేయాలన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు హయాంలో సుమారు 60 లక్షల దొంగ ఓట్లను చేర్పించారనే ఆరోపణలున్నాయని, వాటిని గుర్తించి ఇసి దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఒఎన్‌జిసికి రూ.10,015 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద చమురు, గ్యాస్ ఉత్పత్తిదారు అయినా ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10,015 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.15,206 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన త్రైమాసికం లాభాల్లో 34 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. చమురు ధరల్లో తగ్గుదలనే ఇందుకు కారణమని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ఒఎన్‌జిసి రెవెన్యూ 10 శాతం తగ్గి రూ.1.63 లక్షలుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ1లో రూ.1.82 లక్షల కోట్ల రెవెన్యూ ప్రకటించింది.

సెంచరీ నుంచి జెల్ లాటెక్స్ మ్యాట్రెస్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రముఖ పరుపుల ఉత్పత్తి కంపనీ సెంచరీ మ్యాట్రెస్ కొత్తగా హైబ్రిడ్ కలెక్షన్ జెల్ లాటెక్స్ మ్యాట్రెస్‌ను ఆవిష్కరించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పార్టనర్ కనెక్ట్ మీట్‌లో వీటిని శ్రీమలానీ గ్రూప్ సిఎండి పురుషోత్తమ్ మలానీ వీటిని ఆవిష్కరించారని ఆ సంస్థ తెలిపింది. వివిధ రకాల మందంతో 18 పరిమాణాలల్లో జెల్ లాటెక్స్ మ్యాట్రెస్‌ను పరిచయం చేసినట్లు పేర్కొంది. "తాజా ఆవిష్కరణలు మా అమూల్య కస్టమర్‌లకు అసమానమైన నిద్ర అనుభవాలను అందించడంలో మా తిరుగులేని నిబద్ధతను గుర్తు చేస్తాయి." అని పురుషోత్తమ్ పేర్కొన్నారు. వీటి ప్రారంభ ధరను రూ.19,500గా నిర్ణయించామన్నారు.



సంపాదకీయం


జ్ఞానానికి గేట్‌వే

సమాచార సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర కీలకమైనది. విద్య, పరిశోధన, సంస్కృతి, సమాచార వ్యాప్తికి తోడ్పాటునివ్వడంలో గ్రంథాలయాల పాత్ర అనిర్వచనీయం. ఈ డిజిటల్ యుగంలో లైబ్రరీలు ఈ-బుక్స్, అకడమిక్ జర్నల్స్, రీసెర్చ్ పేపర్లు, మల్టీమీడియా కంటెంట్ సహా తక్షణం అందుబాటులో వుండే సమాచార భాండాగారాలు. ఇంటర్నెట్ అనుసంధానంతో భౌగోళిక సరిహద్దులను దాటి...సమాచారం పొందటానికి అవకాశం ఏర్పడింది. విద్యార్థుల నుంచి పరిశోధకుల వరకు అనంతమైన సమాచారాన్ని ఈ లైబ్రరీలు అందిస్తాయి. చదువుల నైపుణ్యాలను మెరుగుపర్చడానికి, వివిధ విషయాలపై అవగాహన పెంచడానికి...జీవితకాలం తోడుండే నేస్తం లైబ్రరీ. ప్రపంచస్థాయి నుంచి మండల స్థాయి, కళాశాల, పాఠశాల స్థాయి వరకు గ్రంథాలయాలు వున్నాయి. గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాల వరుసలు కాదు, వివిధ పత్రికల సమాహారం అంతకన్నా కాదు. గ్రంథాలయం..ఆలోచనా స్రవంతి...నిశ్శబ్ద చైతన్య దీపిక. మంచి పుస్తకం కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. మంచి పుస్తకమిచ్చే మనశ్శాంతి అనుభవించేవారికే తెలుస్తుందంటారు. ప్రతి ఇంట్లో వంటగది వున్నట్లే పుస్తకాల గది కూడా వుండాలి. 'పుస్తకాలులేని ఇల్లు ఆత్మలేని శరీరం వంటిది' అంటారు. మహాకవి కాళిదాసు జ్ఞానాన్ని సుగంధంతో పోల్చారు. పువ్వు వలే పుస్తకం కూడా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నలుదిక్కులా పరిమళాన్ని వెదజల్లుతుందని అంటారాయన. 'నేను నా లైబ్రరీలోకి వెళ్లానంటే... ప్రపంచ చరిత్ర అంతా నా కళ్ల ముందు కనిపిస్తుంది అంటారు అలెగ్జాండర్ స్మిత్.

దేశ చరిత్ర, కళలు, సంస్కృతులు-పుస్తకాలు లేకుండా వర్థిల్లవు. అధ్యయనం లేకుండా ఏ రంగంలోనూ ఎవరూ రాణించలేరు. గొప్ప సంస్కృతులు గొప్ప చరిత్రగా మనగలగడానికి పుస్తకాలు, గ్రంథాలయాలు వారధులు. 'పుస్తకాలు నా మనస్సుకు, హృదయానికీ రెక్కలనిచ్చాయి/ నేను బురద నుంచి బయటపడటానికి యెంతో తోడ్పడ్డాయి/ పుస్తకాలు చదవకపోతే నా చుట్టూ వున్న మౌఢ్యంలోనూ, నీచంలోనూ మునిగిపోయి వుండేవాడ్ని!/ విశాలమైన ప్రపంచ దృశ్యాలను పుస్తకాలు నా ముందు పరిచాయి' అంటాడు మక్సీం గోర్కీ. దేశ ప్రజలను అలాంటి మౌఢ్యంలోకి, నీచంలోకి నడిపించడానికి, సమాజ వికాసానికి వారధిగా వున్న లైబ్రరీలకు గండి కొట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పావులు కదుపుతోంది. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి, ఆ స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని ఆర్‌ఎస్‌ఎస్ ఒక పథకం ప్రకారం యత్నిస్తోంది. ఇప్పటికే విశ్వవిద్యాలయాలు, కేంద్ర సంస్థలు, శాస్త్ర, పరిశోధనా సంస్థలన్నిటినీ సంఘ్ పరివారంతో నింపేశారు. శాస్త్ర పరిశోధనలకు అందజేసే అవార్డులను నిలిపేశారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశం నుంచి తొలగించారు. పాఠ్యాంశంగా వున్న గాంధీ జీవిత చరిత్రను తొలగించి, సావర్కర్ చరిత్రను జోడించారు. సంఘ్ పరివారాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తూ దళిత, ఆదివాసీ యువతపై కేంద్రీకరించి వారిలో బూజుపట్టిన మనువాద భావాలను నింపుతున్నారు. ఇవన్నీ ఒకెత్తు అయితే...తాజాగా దేశంలోని గ్రంథాలయాలను తన గుప్పిట్లోకి తెచ్చుకొనేందుకు పథకాలు రచిస్తోంది. గ్రంథాలయాల పనితీరులో జోక్యం చేసుకొని, సంఘ్‌పరివార్ భావజాలాన్ని వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకుంది. ఇదే జరిగితే... ఇప్పటివరకూ విజ్ఞానాలయాలుగా వున్న గ్రంథాలయాలు...అజ్ఞాన సమాచారంతో నిండిపోతాయి.

గ్రంథాలయాలు కేవలం పుస్తక నిక్షేపాలు కాదు... అవి సమాచార వనరులు. జ్ఞాన సముపార్జన కేంద్రాలు. నూతన భావాల ఉత్పాదనకు, నూతన విజ్ఞాన సృష్టికి నిలయాలు. 'ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం వుండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగంతోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు' అంటాడు సాల్వెడర్ అలెండీ. ఈ విజ్ఞాన దివిటీలు ఆరిపోకుండా భవిష్యత్తరాలకు వెలుగులు ఇవ్వాలంటే... గ్రంథాలయాలను మనువాదుల బారి నుంచి రక్షించుకోవాలి. అలాగే, వసతులు కొరవడి... దీనావస్థలో కునారిల్లుతున్న గ్రంథాలయాలను పునరుజ్జీవింప జేయడానికి మరో గ్రంథాలయోద్యమం రావాలి.

మహనీయుల మాట



సిద్ధాంతాలు లేని జీవితాన్ని గురించి చెప్పకోవడానికి ఏమీ ఉండదు. వాటి కోసం పోరాడటాన్ని మించిన గొప్ప ఆనందం మరొకటి ఉండదు.

- ఫైడల్ కాస్ట్రో,

జననం: 13.8.1926
మరణం: 25.11.2016

పట్టణ జాతీయ ఉపాధి హామీ పథకం కావాలి

విశ్లేషణ



వి. రాంభూపాల్

దేశంలో పట్టణ జనాభా పెరుగుతున్నది. ఈ జనాభా పెరుగుదలకు అనుగుణంగా పట్టణాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంలేదు. మరోవైపు వ్యవసాయంలో వస్తున్న మార్పులు పేదలను గ్రామాల నుండి పట్టణాలకు తరిమేస్తున్నాయి. ప్రతి పట్టణంలో మురికివాడల సంఖ్య పెరిగిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పట్టణ సంస్కరణలు పేద, దిగువ మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారాలు మోపుతున్నాయి. పట్టణాల్లోకి పెద్దఎత్తున చొరబడుతున్న కార్పొరేట్ సంస్థలు చిన్నచిన్న వ్యాపారాలను, స్వయం ఉపాధిని, చేతివృత్తులను చావుదెబ్బ తీస్తున్నాయి. ఇల్లు, తిండి, విద్య, వైద్యం లాంటి ఖర్చులు తలకు మించిన భారంగా మారాయి. వీటి వల్ల పట్టణాల్లో పేదరికం తీవ్రంగా పెరిగిపోతున్నది. సరైన తిండి కొరత, అప్పుల భారాలు, మానసిక ఒత్తిళ్ళు తీవ్రమవుతున్నాయి.

దేశ జనాభాలో పట్టణ జనాభా సుమారు 38 శాతం వుంటుంది. పట్టణాల అభివృద్ధిలో కూలీల పాత్ర ప్రధానమైనది. కరోనా సమయంలో పట్టణ పేదలు తమ స్వగ్రామాలకు వెళ్ళడంతో పట్టణాలు ఎంతగా అల్లాడిపోయాయో చూశాము. దేశ స్థూల జాతీయ ఆదాయంలో పట్టణాల వాటా 62 శాతంగా వుందంటే అందులో ఈ శ్రామికుల కష్టం ముఖ్యమైనది. అలాంటి శ్రామికులకు పనులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. యుపిఎ పాలనాకాలంలో వామపక్షాల ఒత్తిడితో తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో అమలు చేయాలి. జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకం కావాలి. పట్టణాల్లో పని చేయగలిగిన శ్రామికులకు సంవత్సరంలో వంద రోజుల పనిని చట్టబద్ధంగా కల్పించాలని సిపిఎం, వామపక్ష పార్టీలు అనేక సంవత్సరాలుగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఇటీవలే ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో అనంతపురం పార్లమెంట్ సభ్యుడు తలారి రంగయ్య ఆగస్టు 5న ...జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు మీద ...'జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకం' కోసం ప్రైవేటు మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు.

పట్టణీకరణ-పేదరికం

బ్రిటీష్ పాలనా కాలంలో వారు అనుసరించిన విధానాల వల్ల దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. తద్వారా పట్టణీకరణ చాలా అలస్యంగా ప్రారంభమై, నెమ్మదిగా అభివృద్ధి అయ్యింది. 1951 నుండి 2001 వరకు దేశంలో పట్టణాలు, నగరాల సంఖ్య 2125 మాత్రమే వున్నాయి. 2001 నుండి 2011 నాటికి 2771, ప్రస్తుతం సుమారు మూడు వేలకు పైగా నగరాలు వున్నాయి. 1971-81 మధ్య కాలంలో ప్రభుత్వ రంగం పెరగడం వల్ల 2001 వరకు పట్టణ జనాభా పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాతి కాలంలో ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి మందగించినప్పటికీ వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో యువత పట్టణాలకు రావడం పెరిగింది. ధనిక రైతుల్లో కొందరు పట్టణాల్లో స్థిరపడడం, వారి పిల్లలు చదువుల కోసం పట్టణాలకు రావడం ఆ తర్వాత అక్కడే స్థిరపడడం పెరిగింది. దళితులు తమపై కొనసాగుతున్న అణచివేత, కుల వివక్ష నుండి తప్పుకోవడానికి పట్టణ ప్రాంతాలకు వచ్చి స్థిరపడుతున్నారు. వీటితోపాటు పట్టణాల్లోకి పరిసర గ్రామాలను కలపడం వల్ల కూడా పట్టణ జనాభా పెరిగింది. పెరుగుతున్న జనాభాకు పని కల్పించడం, నివాసాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వాల బాధ్యత. దేశవ్యాప్తంగా పట్టణాల్లో 2 కోట్ల ఇళ్ల కొరత వున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీరికి నివాసాలు ఏర్పాటు చేసి, పనులు కల్పించకుండానే 100 స్మార్ట్‌సిటీలు నిర్మించేందుకు రూ.7,000 కోట్లు ఖర్చు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో రూ.1,000 కోట్లను స్మార్ట్‌సిటీస్ మిషన్‌కు కేటాయించింది. పాలకుల దృష్టిలో అభివృద్ధి అంటే స్మార్ట్‌సిటీల నిర్మాణం మాత్రమే.

దేశంలో నిరుద్యోగం గత 40 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా ఈ కాలంలో పెరిగిపోయి చదువుకున్న నిరుద్యోగులకు తోడు పనులు కోల్పోయిన వారు పెరిగిపోతున్నారు. 2022 మార్చి 14న జాతీయ గణాంకాల బ్యూరో విడుదల చేసిన లెక్కల ప్రకారం పట్టణ నిరుద్యోగం 12.6 శాతం, మహిళల నిరుద్యోగం 14.3 శాతంగా వుంది. వాస్తవంగా ఈ సంఖ్య 20.8 శాతం పైగా వుంటుందని నిపుణుల అంచనా. దీనికి తోడు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, అతి తక్కువ వేతనాలు, భద్రత లేని ఉపాధి... పట్టణ పేదలను పీడిస్తున్న అతి పెద్ద సమస్యలు.

మన రాష్ట్రంలో పట్టణ జనాభా 2011 లెక్కల ప్రకారం 33.36 శాతం. 2000- 2011 మధ్యలో పట్టణ జనాభా 7 శాతం పెరిగింది. 2029 నాటికి 43 శాతానికి చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం 17 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 31 నగర పంచాయితీలు మొత్తం 125 పట్టణాలు వున్నాయి. ఇందులో 1,46,10,410 మంది నివసిస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన 5,409 మురికివాడల్లో మొత్తం పట్టణ జనాభాల్లో 18 శాతం మంది ఇక్కడ నివసిస్తున్నారు.

పట్టణ పేదల పరిస్థితులు

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క కొత్త పరిశ్రమ రాలేదు. గతంలో వున్న రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, చేనేత మగ్గాలు, ఆక్వా, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వేల సంఖ్యలో మూతబడి లక్షల మంది ఉపాధి కోల్పోయారు. వున్న కొద్దిపాటి పనులకు తీవ్రమైన పోటీ పెరిగి కూలీ రేట్లు తగ్గడం, పనిదినాలు తగ్గడం జరుగుతుంది. పట్టణ పేదల్లో అత్యధికమంది ఆధారపడిన రంగం భవన నిర్మాణం. మాల్స్, ఇవెంట్ మేనేజ్‌మెంట్, విద్య, వైద్య సర్వీసులు, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ ఏజంట్లుగా, గిగ్ కార్మికులుగా, టూరిజం, ట్రాన్స్‌పోర్ట్, ప్రయివేటు ఆఫీసులు, కన్సల్టెన్సీలు, ఇంటి పని లాంటి రంగాల్లోనే కొద్దిమంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. 1993 నుండి 2012 వరకు దేశవ్యాప్తంగా వస్తూత్పత్తి రంగంలో కేవలం 60 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వచ్చాయి. మన రాష్ట్రంలో 2016, 2017, 2018 సంవత్సరాల్లో వరుసగా విశాఖలో సిఐఐ భాగస్వామ్యంతో ప్రపంచ పారిశ్రామిక సదస్సులు జరిగాయి. ఒక్క 2017 లోనే రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేట్ కంపెనీల మధ్య రూ.10.54 లక్షల కోట్ల విలువ చేసే 655 ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల వల్ల 22 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2023 మార్చి 3,4 తేదీలలో మరోసారి పారిశ్రామికవేత్తల అంతర్జాతీయ సదస్సును విశాఖపట్నంలో నిర్వహించింది. ఈ సదస్సు ద్వారా 2 లక్షల నుండి 10 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ సదస్సుల వల్ల కొత్తగా పెట్టుబడులు రాలేదు, ఉపాధి అవకాశాలు పెరగలేదు. వచ్చిన అరకొర పెట్టుబడులు సోలార్, విండ్ మిల్లు లాంటి విద్యుత్ ఉత్పత్తిలో వచ్చాయి. ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు అతి తక్కువ. కొద్దిమంది నిపుణులకు మహా నగరాల్లో ఐ.టి రంగం లాంటి సేవరంగాల్లో ఉపాధి దొరికింది. కాని పట్టణాల్లోని నైపుణ్యం లేని, లేదా అర్ధ నైపుణ్యం వున్న శ్రామికుల పరిస్థితి ఏమిటీ? వీరికి పని కల్పించకుండా కొనుగోలు ఎలా పెరుగుతుంది? రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుంది?

కేరళ పట్టణ ఉపాధి హామీ పథకం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగే కేరళ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం 'అయ్యంకాళి పట్టణ ఉపాధి హామీ పథకం' అమలు చేస్తున్నది. డైరెక్టరేట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ కేరళ విభాగం ద్వారా ఈ పథకం అమలవుతుంది. సంవత్సరంలో సరిపడ పనులు లేనప్పుడు ఈ పథకం ద్వారా కుటుంబానికి వంద రోజులు పని కల్పించి పేదలను ఆదుకోవడం లక్ష్యం. నివాసం వున్న కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పేర్లు నమోదు చేసుకున్న 15 రోజులకు జాబ్ కార్డులు ఇవ్వడం, పని కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పని కల్పించడం జరుగుతుంది. 5 కి.మీ లోపు పని చూయించలేకపోతే వేతన రేటుకు అదనంగా 10 శాతం వేతనం ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో 50 శాతం మంది మహిళలు.

కేరళ తరహాలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ ఉపాధి పథకాలను అమలు చేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో 'ముఖ్యమంత్రి యువ స్వాభిమాన్ యోజన', ఒడిషాలో 'ఉన్నతి పట్టణ వేతన ఉపాధి', జార్ఖండ్‌లో 'ముఖ్యమంత్రి శ్రామిక్ యోజన', హిమాచల్ ప్రదేశ్‌లో 'ముఖ్యమంత్రి శహరీ అజీవిక గ్యారంటీ యోజన', తమిళనాడులో 'తమిళనాడు అర్బన్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్' అమలవుతున్నాయి.

రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అమలు, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్వాసితుల సమస్య ఇలా ఏ ఒక్కటీ కేంద్రం నుండి సాధించలేని నిస్సహాయ స్థితిలో మన రాష్ట్ర పాలక, ప్రతిపక్షాలు వున్నాయి. మరోవైపు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతుంది. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో అనేక జిల్లాల్లో పంట సాగు బాగా తగ్గింది. దీనివల్ల పట్టణాలకు వలసలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణ పేదలకు పనులు కల్పించడాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా ప్రభుత్వం గుర్తించాలి. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రంతో పోరాడాలి. వైసిపి తన ఎం.పి ద్వారా పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన పట్టణ ఉపాధి హామీ పథకం బిల్లు చట్టంగా రావడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఇతర రాష్ట్రాల లాగా మన రాష్ట్రంలో పట్టణ ఉపాధి పథకాన్ని ప్రవేశ పెట్టాలి. నగదు బదిలీ పథకాలు అమలు చేసి అవే సర్వస్వం అనుకుంటే సరిపోదు. ప్రజలకు పనులు కల్పించి, ఆత్మాభిమానంతో జీవించేలా చూడాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లాగే కేరళ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం 'అయ్యంకాళి పట్టణ ఉపాధి హామీ పథకం' అమలు చేస్తున్నది. డైరెక్టరేట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ కేరళ విభాగం ద్వారా ఈ పథకం అమలవుతుంది. సంవత్సరంలో సరిపడ పనులు లేనప్పుడు ఈ పథకం ద్వారా కుటుంబానికి వంద రోజులు పని కల్పించి పేదలను ఆదుకోవడం లక్ష్యం. నివాసం వున్న కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పేర్లు నమోదు చేసుకున్న 15 రోజులకు జాబ్ కార్డులు ఇవ్వడం, పని కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పని కల్పించడం జరుగుతుంది.

ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో అనేక జిల్లాల్లో పంట సాగు బాగా తగ్గింది. దీనివల్ల పట్టణాలకు వలసలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణ పేదలకు పనులు కల్పించడాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా ప్రభుత్వం గుర్తించాలి. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రంతో పోరాడాలి. వైసిపి తన ఎం.పి ద్వారా పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన పట్టణ ఉపాధి హామీ పథకం బిల్లు చట్టంగా రావడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఇతర రాష్ట్రాల లాగా మన రాష్ట్రంలో పట్టణ ఉపాధి పథకాన్ని ప్రవేశ పెట్టాలి



ప్రమాదకర బిల్లులకు పార్లమెంట్ ఆమోదం!

వ్యాఖ్య

ప్రజలతో, పర్యావరణంతో ఎలాంటి సంబంధం లేకుండా ప్రైవేటు పెట్టుబడిదారులు జాతీయ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేసుకోవడానికి అనుమతించిన విధానాన్నే కొనసాగిస్తూ, మోడీ ప్రభుత్వం రెండు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించింది. వీటివల్ల భవిష్యత్తులో తీవ్ర పర్యవసానాలు ఏర్పడే ప్రమాదముంది. అందులో ఒకటి అటవీ (సంరక్షణ) చట్టాన్ని (ఎఫ్‌సిఎ) సవరించడం కాగా, రెండవది గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) (ఎంఎండిఆర్) చట్టం. అడవులుగా పేర్కొనబడిన భూముల రిజర్వేషన్‌ను ఏకపక్షంగా తొలగించడాన్ని నివారించేందుకు 1980లో ఆమోదించబడిన అటవీ సంరక్షణ చట్టంలో కఠినమైన నిబంధనలు వున్నాయి. నిర్లక్ష్యపూరిత దోపిడీ నుండి అడవులను సంరక్షించుకోవాలన్నది దీని ఉద్దేశ్యం.

అయితే ఆ తర్వాత 2006లో గిరిజన తెగలకు భూమి హక్కులు ఇవ్వడానికి, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించడానికి గాను ఎఫ్‌ఆర్‌ఎగా తెలిసిన షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీవాసుల (అటవీ హక్కుల చట్టం గుర్తింపు) చట్టం ద్వారా కొన్ని మినహాయింపులను చేర్చారు.

రోడ్డు, రైల్వే లైన్లు, భద్రతాపరమైన సదుపాయాలు, రక్షణ శిబిరాలు, వైర్‌లెస్ స్టేషన్లు, వంతెనలు, కందకాలు, పైప్‌లైన్లు, జంతు ప్రదర్శన శాలలు, సఫారీలు, పర్యావరణ హితమైన పర్యాటక సదుపాయాల నిర్మాణం కోసం కొన్ని మినహాయింపులను ఇవ్వడం ద్వారా... ప్రస్తుతమున్న చట్టం యావత్ నియంత్రణా నిర్మాణాన్ని నిర్వీర్యం చేయడానికి, అడవుల నిర్వచనాన్ని నీరుగార్చడానికి ...మోడీ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది.

అడవిగా నిర్వచించని ప్రాంతాలను 'డీమ్డ్ ఫారెస్ట్'గా పరిగణించాలని పేర్కొంటూ 1996లో సుప్రీంకోర్టు నిర్దేశించినట్లుగా అడవుల భావనను తిరిగి నిర్వచించింది. గ్రామసభలు, ఇతర పర్యవేక్షక కమిటీల సమ్మతిని, అంగీకారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొంటున్న ఎఫ్‌ఆర్‌ఎ నిబంధనలను ఈ బిల్లు పక్కనబెట్టింది. సమ్మతి తెలియచేయాల్సిన అంశాన్ని గిరిజన కమ్యూనిటీలకే వదిలిపెట్టడంతో తమ భూములను లాక్కోవడానికి వ్యతిరేకంగా వారు ఏమీ చేయలేని నిస్సహాయులవుతున్నారు. ఒక్క దెబ్బతో, అడవుల విధ్వంసానికి సిద్ధమవుతోంది. అంతేకాదు! అడవుల్లో నివాసమేర్పరచుకున్న వారు నిర్వాసితులు కానున్నారు. అటవీ భూములను స్వాధీనం చేసుకోవడానికి చట్టాల ద్వారా, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ద్వారా విధించిన క్రమబద్ధీకరణ పరిమితులను వదిలించుకోవడానికి ఇదంతా జరిగిందన్నది సుస్పష్టం.

మోడీ ప్రభుత్వం గత దశాబ్ద కాలంలో పర్యావరణ క్రమబద్ధీకరణ యంత్రాంగాన్ని అదేపనిగా ధ్వంసం చేస్తూ వచ్చింది. భవిష్యత్తులో జరిగే మార్పులు, ఏర్పడే పర్యవసానాలను దాని కొనసాగింపుగానే చూడాలి. గతంలో తీసుకున్న (గతంలో సవరణలుగా లేదా ఆఫీసు ఉత్తర్వులుగా ప్రవేశపెట్టిన) చర్యల్లో పర్యావరణ ప్రభావం అంచనా నిబంధనలు, కోస్తా ప్రాంత నియంత్రణలు తదితరాలు వున్నాయి. అటవీ సంరక్షణ చట్ట సవరణతో పాటుగా, ప్రభుత్వం జీవ వైవిధ్య చట్ట సవరణను కూడా ఇదే తరహాలో తీసుకువచ్చింది. ఈ చట్టం కింద జరిగే నేరాలను ఈ మార్పు నేరరహితం చేస్తుంది. 'క్రోడీకరించబడిన సాంప్రదాయ విజ్ఞానం' నిర్వచనాన్ని మసకబారుస్తుంది. ఆయుష్ ప్రాక్టీషనర్లను చట్ట పరిధి నుండి మినహాయిస్తుంది. ఇదంతా కలిసి కార్పొరేట్ ప్రయోజనాలకు ముఖ్యంగా కార్పొరేట్ ఔషధ సంస్థల ప్రయోజనాలకు అవసరమయ్యే రీతిలో అడవుల్లోని వృక్ష, జంతుజాలాన్ని అడ్డూ అదుపు లేకుండా దోచుకోవడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది.





ఇక ఈ వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ఆమోదించిన రెండవ సవరణ చట్టం గనులు, ఖనిజాల క్రమబద్ధీకరణను నీరుగారుస్తుంది, మార్చేస్తుంది. వాస్తవానికి ఈ చట్టం పరిధిలో... ఖనిజాల అన్వేషణ క్రమం కొన్ని కఠినమైన పరిస్థితుల్లో మినహా తవ్వడం, డ్రిల్లింగ్ చేయడం వంటి విధ్వంసకర చర్యలను నిషేధిస్తుంది. అయితే, సవరణ తీసుకువచ్చిన తర్వాత, ప్రాథమిక సర్వే క్రమంలో గుంటలు, కందకాలు తవ్వడం, డ్రిల్లింగ్ చేయడం, ఉపరితలంపైన తవ్వకాలు వంటివి అనుమతించబడ్డాయి. అటవీ ప్రాంతాల్లో ఈ తరహా అన్వేషణ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ఇకపై అటవీ అనుమతులు తప్పనిసరి కాదు.

మన దేశంలో ఖనిజ సంపద పెద్ద మొత్తంలో అటవీ ప్రాంతాల్లో వుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇలా చట్టాల్లో మార్పులు తీసుకురావడంతో, ఏ కార్పొరేట్ సంస్థ అయినా అటవీ ప్రాంతం లేదా ఆ ప్రాంతంలో నివసించే ప్రజలతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి విధ్వంసక అన్వేషణను ప్రారంభించవచ్చు. ఇందుకు సంబంధించి, ఎఫ్‌సిఎ, ఎంఎండిఆర్ ఈ రెండు సవరణ చట్టాల విలీనం స్పష్టమైంది. పైగా, ఏవో కొన్ని నిర్దిష్ట కేసుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం వుంటుంది మినహా సాధారణంగా గనుల హక్కుల వేలం అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వుంటుంది. కానీ ఈ సవరించిన చట్టం లిథియం, కోబాల్ట్, నికెల్, పొటాష్, తగరం, ఫాస్పేట్ వంటి వ్యూహాత్మక ఖనిజాలకు సంబంధించి హక్కులను కేంద్రీకృతం చేసింది. అదనంగా బంగారం, వెండి, రాగి, తదితరాలతో సహా 29 ఖనిజాలకు ప్రత్యేక తవ్వకాల లైసెన్సులను జారీ చేసే అధికారాన్ని కొత్త చట్టం కేంద్ర ప్రభుత్వానికే కట్టబెట్టింది. ఆరు లోహాలు-లిథియం, బెరీలియం, నియోబియం, టైటానియం, టాంటాలమ్, జిర్కోనియమ్‌లను 'ఆటోమేటిక్ మినరల్స్' జాబితా నుండి తొలగించారు. వాటి కోసం గనుల తవ్వకాలు, అన్వేషణ చేపట్టేందుకు ప్రైవేటు సంస్థలను అనుమతించారు. ఖనిజాల సగటు అమ్మకం ధర (ఎఎస్‌పి) లెక్కింపు నుండి వివిధ సుంకాలు, లెవీలను (గనుల వెలుపల ధర) కొత్త ఎంఎండిఆర్ నిబంధనలు మినహాయిస్తున్నాయి. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు, అలాగే ఈ రోజుల్లో బాగా డిమాండ్ వున్న లిథియం వంటి లోహాలతో పాటూ సహజ వనరులను లాభదాయకమైన రీతిలో దోపిడీ చేసేందుకు వీలు కల్పించడమే ఈ కొత్త నిబంధనల ఉద్దేశ్యంగా వుంది.

మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అనుసరించే ఈ కార్పొరేట్ అనుకూల వైఖరి, అన్ని విధానాల్లోనూ (పన్నుల్లో కోతలు, రాయితీలు ఇవ్వడం నుండి లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెంచుకునేందుకు దోహదపడేలా...రక్షణాత్మక కార్మిక చట్టాలను నీరు గార్చడం వరకు) విస్తరిస్తోంది. అలాగే ప్రభుత్వ రంగ ఆస్తులు, మౌలిక సదుపాయాలను అప్పగించడం నుండి బొగ్గు తవ్వకాలు, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాలకు ప్రైవేటు సంస్థలకు ద్వారాలు తెరవడం వరకు చివరకు రక్షణ రంగంలో కూడా దేశ విదేశాల నుండి ప్రైవేటు పెట్టుబడులను అనుమతించడం వరకు వ్యాప్తి చెందుతోంది. పర్యావరణ చట్టాలకు, నిబంధనలకు నిర్లక్ష్యంగా చేసిన మార్పులను ఇంత విస్తృతమైన చట్ర పరిధిలో చూడాల్సి వుంది. పర్యావరణ పరిరక్షణ గురించి పైకి విపరీతమైన ఆందోళనను కనబరుస్తూ, వాతావరణ మార్పులపై పోరాడుతున్నామని చెప్పుకునే ఈ ప్రభుత్వం... వాస్తవానికి, ప్రజలను పణంగా పెట్టి మరింత పర్యావరణ విధ్వంసానికి దారితీసేలా దేశాన్ని నడిపిస్తోంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కవిత్వం

రైతు బతుకు

యాడ సూసినా
మేఘాలు కొండల్ని మేసేత్తాండాయి
చిలకరింపులతో
పలకరిస్తా పోతాండాయి
గాటికాడ గొడ్డు లేకపాయే
దొడ్లో రాశి పడకపాయే.
గింజంటని సేను
గడ్డి పాసతో ఉరెట్టుకుని
బీడు గోరి కట్టేసుకున్నట్టాయే
పుట్లు పుట్లుగా ఆశను కట్టి పెట్టి
పట్టెడు బీముకే
దోసిలి పట్టుడాయే.
ఉరిమిపడ్డ మబ్బు
ఊరి మీద పడి ఏడుత్తాంటే
కాల్వలెంట పునాదులు
పరుగులు పెడ్తా ఉరుకుడాయే.
గుర్రున చూసి చినుకు
గదమాయిస్తా ఎళ్ళెళ్ళిపోతాంటే
పిల్లకాల్వలే తప్ప
అదునుకొచ్చిన పంట నవ్వకపాయే.
ఓ రైతన్నా సూస్తివా
వానకాలం ఎండ
నెత్తిని కాల్చుతా మండుతాంటే
దిక్కుతెలియని బతుక్కి
దారే కనబడక అల్లాడిపాయే.
అరువు బండెక్కి కాపురం
కరువు దారెంబడి పరుగుతీత్తాంటే
ఎరువెయ్యని సెలకలో సిగురు
మొలకలోనే పాణం వదులుడాయే
సీమ కంట్లో నీళ్ళు
ఎగిరెగిరి పడి కురుత్తాంటే
కట్టుకున్న గుడిసె కొట్టుకుపాయే
పెట్టుకున్న పంట ఏటిపాలాయే
ఓ రైతన్నా
మన స్థితి గతి ఎరుకైందిరన్నా.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్: 9666016636

ఐదుగురు పోలీసు అధికారులకు కేంద్ర హోం శాఖ పతకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేర పరిశోధనలో వృత్తిపరంగా అత్యున్నతస్థాయి ప్రమాణాలను పాటించి, పరిశోధన ప్రతిభను చాటినవారికి కేంద్ర హోంశాఖ అందజేసే పురస్కారాలకు ఈ ఏడాది 140 మంది పోలీసు, ఇతర దర్యాప్తు అధికారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు పోలీసులు.. కొత్తకొండ సుప్రజ (అదనపు ఎస్‌పి), మల్లెల ధనుంజయుడు (డిప్యూటీ ఎస్‌పి), ఉప్పుటూరి రవికాంత్ (డిఎస్‌పి), గుంట్రెడ్డి అశోక్ కుమార్ (సర్కిల్ ఇన్స్‌పెక్టర్), షేక్ మస్తాన్ షరీఫ్ (సర్కిల్ ఇన్స్‌పెక్టర్) ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. నేరపరిశోధనలో వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహించడం, ప్రతిభను గుర్తించేందుకుగానూ కేంద్ర హోంశాఖ 2018లో ఈ పతకాలను ప్రవేశపెట్టింది. ప్రతి ఏటా ఆగస్టు 12న ప్రకటిస్తారు. 2023 సంవత్సరానికి ఈ పురస్కారాలకు రాష్ట్రాల్లోని పోలీసు అధికారులతోపాటు సిబిఐ, ఎన్ఐఎతో కలిపి 140 మంది ఎంపికయ్యారని హోంశాఖ ప్రకటించింది.

టాటా ఇవి కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ : దిగ్గజ వాహన కంపెనీ టాటా మోటార్స్ ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ కార్లపై భారీగా డిస్కౌంట్‌లను ప్రకటించింది. టాటా టిగోర్ ఇవి, టాటా నెక్సాన్ ఇవిలపై రూ.80వేల వరకు తగ్గింపును ఇస్తోన్నట్లు తెలిపింది. టాటా టిగోర్‌పై రూ.80 వేల రాయితీ ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ తగ్గింపు, అదనపు వారంటీ లేదా ఉపకరణాలు ఉన్నాయి. దీని ఎక్స్‌షోరూం ధర రూ.12.49-13.75 లక్షలుగా ఉంది. నెక్సాన్ ఇవిలోని రెండు వేరియంట్‌లు అయినా ప్రైమ్, మ్యాక్స్‌పై వరుసగా రూ.61,000, రూ.56,000 డిస్కౌంట్‌ను అందిస్తుంది. ఎక్స్‌షోరూం వద్ద వీటి ధర రూ.14.49 లక్షల నుంచి రూ.17.19 లక్షలుగా ఉంది.

చిరుత పంజాకు 'చిన్నారి' బలి

- అలిపిరి నడక దారిలో వెళ్తుండగా ఘటన
- రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన టిటిడి చైర్మన్



మృతదేహాన్ని గోనెసంచిలో తీసుకొస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుమల

ఆరేళ్ల చిన్నారి చిరుతపులి పంజాకు బలైపోయింది. అలిపిరి నడకదారిలో వెళ్తున్న చిన్నారిని చిరుత అటవీ ప్రాంతంలోకి లాక్కుపోయి చంపేసింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ హృదయవిదారక ఘటన శనివారం వెలుగు చూసింది. జూన్ 23న అదే ప్రాంతంలో చిరుత దాడికి గురైన బాలుడు కౌశిక్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు. ఆ ఘటన తర్వాత టిటిడి అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడు చిన్నారి బలయ్యేది కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను టిటిడి చైర్మన్ ప్రకటించారు. సరైన రక్షణ చర్యలు చేపట్టనందునే చిరుత పులికి చిన్నారి బలైందని సిపిఎం విమర్శించింది. చిన్నారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసింది.

నెల్లూరు జిల్లా పోతిరెడ్డిపాలేనికి చెందిన శశికళ, దినేష్‌కుమార్ దంపతులు తమ కుమార్తె లక్షిత (6)తో కలిసి శ్రీవారిని దర్శించుకోవడానికి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అలిపిరి నడక దారిలో బయల్దేరారు. రాత్రి 7.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామి గుడి వద్దకు చేరుకున్నారు. ఇంకో గంటలో తిరుమలకు చేరుకుంటారనగా ముందు వెళ్తున్న చిన్నారి వారికి కనిపించలేదు. ఆ ప్రాంతంలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు చేపేందుకు వీలు పడలేదు. శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొద్దిదూరంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. ఎలుగుబంటి దాడిలో మరణించినట్లు టిటిడి డిఎఫ్ఒ తొలుత అనుమానం వ్యక్తం చేశారు. చిరుత దాడిలోనే చిన్నారి చనిపోయిందని పోస్టుమార్టం అనంతరం రుయా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. బాలిక కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ బిడ్డ మృతికి టిటిడి, అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యమే కారణమని లక్షిత తల్లి కన్నీరు మున్నీరయ్యారు. నడక దాడిలో వెళ్తున్న వారిపై వన్యమృగాలు వరుసగా దాడులు చేస్తున్నా మెట్ల మార్గాన్ని ఎందుకు మూసివేయడం లేదని ప్రశ్నించారు. భక్తుల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా : టిటిడి చైర్మన్

లక్షిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో రూ.5 లక్షలు టిటిడి, మరో రూ.5 లక్షలు అటవీ శాఖ తరపున అందిస్తామని చెప్పారు. బాలిక మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తిరుమల సందర్శకుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. భద్రతాపరమైన ప్రతిపాదనలపై చర్చించి టిటిడి ఖర్చుతో రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. చిన్న పిల్లలతో నడకమార్గంలో తిరుమలకు వచ్చే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నడకమార్గాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు : టిటిడి ఇఒ

నడకదారుల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి, అటవీ, పోలీసు అధికారులతో ఆయన అత్యవసరంగా సమావేశమయ్యారు. నడక మార్గంలో 500 సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇరువైపులా కంచె ఏర్పాటుకు సమగ్ర నివేదిక అందించాలని డిఎఫ్ఒను ఆదేశించారు. చిరుత దాడి ఘటనపై సిసిఎఫ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీన్ రీకనస్ట్రక్షన్ చేయించి, చిరుతను బంధించడానికి బోన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు మాత్రమే ఈ దారిలో అనుమతించే అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అత్యంత విషాదకరం : చంద్రబాబు

చిన్నారి లక్షిత మృతి అత్యంత విషాదకరమని టిడిపి అధినేత చంద్రబాబు ట్విట్టర్ వేదికగా స్పందించారు. కొద్దిరోజుల క్రితం చిరుత దాడిలో బాలుడు గాయపడ్డాడని చంద్రబాబు గుర్తు చేశారు. టిటిడి మరిన్ని రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడు ఈ ఘోరం తప్పేదని పేర్కొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి : సిపిఎం

టిటిడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షిత మృతి చెందిందని, ఆ చిన్నారి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. కౌశిక్ ఘటన జరిగినప్పుడే టిటిడి అధికారులు అప్రమత్తమై తగు చర్యలు తీసుకొని ఉంటే ఈ రోజు లక్షిత ఘటన జరిగేది కాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుయా మార్చురీలో ఉన్న లక్షిత మృతదేహాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు.

తయారీ రంగం డీలా

- మూడు నెలల కనిష్టానికి పారిశ్రామికోత్పత్తి
- జూన్‌లో 3.7 శాతానికి తగ్గుదల



న్యూఢిల్లీ : భారత తయారీ రంగం డీలా పడింది. ప్రస్తుత ఏడాది జూన్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వృద్ధి 3.7 శాతానికి పడిపోయి.. మూడు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం మాసంలో ఇది 5.3 శాతం పెరుగుదలను కనబర్చింది. 2022 జూన్‌లో ఏకంగా 12.6 శాతం వృద్ధి నమోదయ్యింది. మే ఐఐపిని 5.2 శాతం నుంచి 5.3 శాతానికి సవరిస్తూ కేంద్ర గణాంకాల శాఖ నిర్ణయం తీసుకుంది. గడిచిన జూన్‌లో తయారీ రంగం ఏకంగా 3.1 శాతానికి క్షీణించింది. ఇంతక్రితం మాసంలో ఇది 5.8 శాతం పెరిగింది. "ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన జూన్ ఐఐపి 3.7 శాతనికి తగ్గి.. మూడు మాసాల కనిష్టానికి పడిపోయింది. కీలక రంగాలు రాణించలేకపోయాయి." అని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ ఆదితి నయర్ పేర్కొన్నారు. క్రితం మేలో గనుల రంగం ఉత్పత్తి 6.4 శాతంగా ఉండగా.. జూన్‌లో 7.6 శాతానికి పెరిగింది. విద్యుత్ రంగం ఉత్పత్తి 4.2 శాతంగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన కాలంలో ఐఐపి 4.5 శాతానికి పరిమితమయ్యింది. గతేడాది ఇదే సమయంలో ఏకంగా 12.9 శాతం వృద్ధి నమోదయ్యింది. మొత్తం ఐఐపిలో తయారీ రంగం 77.63 శాతం వాటాను కలిగి ఉంది. అత్యంత కీలకమైన తయారీ రంగం ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడంతో ఆ ప్రభావం పారిశ్రామిక ఉత్పత్తిపై పడింది. ఇటీవలి కాలంలో ప్రజల ఆదాయాలు, పొదుపు స్థాయిలు భారీగా పడిపోవడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోంది. సంపదను కొద్ది మంది వద్ద పోగబడకుండా చూడటంతో పాటుగా ప్రజల కొనుగోలు శక్తి పెంచడం ద్వారానే పారిశ్రామిక రంగానికి మద్దతు లభించనుంది.

కదం తొక్కిన జైస్వాల్, శుభ్‌మన్



- టి20ల్లో అత్యధిక భాగస్వామ్యం నమోదు
- నాల్గో టి20లో విండీస్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు

ఫ్లోరిడా: నాల్గో టి20లోనూ భారత బ్యాటర్లు కదం తొక్కారు. విండీస్ నిర్దేశించిన 179పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ఓపెనర్లు తొలి వికెట్‌కు 165పరుగుల అత్యధిక భాగస్వామ్యాన్ని నెలకొల్పి విజయ తీరాలకు చేర్చారు. దీంతో భారతజట్టు కేవలం 17ఓవర్లలో శుభ్‌మన్ గిల్(77) వికెట్‌ను కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. శనివారం ఏకపక్షంగా సాగిన నాల్గో టి20లో యశస్వి జైస్వాల్(84నాటౌట్; 51బంతుల్లో, 11ఫోర్లు, 3సిక్సర్లు) శుభ్‌మన్ గిల్(77; 47బంతుల్లో 3ఫోర్లు, 5సిక్సర్లు) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. షిమ్రాన్ హెట్‌మైర్(61; 39బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లు) మాత్రమే బ్యాటింగ్‌లో మెరిసాడు. షాయ్ హోప్(45; 29బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 178 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్‌కు మూడు, కుల్దీప్ యాదవ్‌కు రెండు, అక్షర్ పటేల్, చాహల్, ముకేశ్ కుమార్ తలో వికెట్ తీసారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరుజట్లు 2-2తో సమంగా నిలవగా.. ఐదో, చివరి టి20 ఆదివారం(13న) జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ యశస్వి జైస్వాల్‌కు లభించింది.

అత్యధిక భాగస్వామ్యం

టి20ల్లో జైస్వాల్-శుభ్‌మన్ కలిసి అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. విండీస్‌తో జరిగిన నాల్గో టి20లో వీరిద్దరూ తొలి వికెట్‌కు 165పరుగులు జోడించారు. దీంతో ఈ ఫార్మాట్‌లో రెండో అత్యధిక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇక జైస్వాల్ 21ఏళ్ల 227రోజులకు ఈ ఫార్మాట్‌లో అర్ధసెంచరీ(84పరుగులు) చేసిన నాల్గో బ్యాటర్‌గా నిలిచాడు. జైస్వాల్ కంటే ముందు రోహిత్(20ఏళ్ల, 143రోజులు), తిలక్ వర్మ(20ఏళ్ల 271రోజులు), రిషబ్ పంత్(21ఏళ్ల, 38రోజులు) కంటే ముందున్నారు.

టి20ల్లో ఓపెనర్ల అత్యధిక భాగస్వామ్యం

176 :	దీపక్ హుడా-సంజు శాంసన్(ఐర్లాండ్‌పై 2022)
165 :	కేఎల్ రాహుల్-రోహిత్ శర్మ(శ్రీలంకపై 2017)
165 :	జైస్వాల్-శుభ్‌మన్(వెస్టిండీస్‌పై 2023)
160 :	ధావన్-రోహిత్ శర్మ(ఐర్లాండ్‌పై 2018)

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ

విజేత భారత్

- మలేషియాపై 4-3తో గెలుపు
- నాల్గోసారి టైటిల్ కైవసం



చెన్నై: చివరి నిమిషం వరకు ఉత్కంఠ భరితంగా జరిగిన ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత హాకీజట్టు మలేషియాను చిత్తుచేసిం ది. మేయర్ రాధాకృష్ణన్ సేట్డఇయంలో జరిగిన ఫైనల్లో భారతజట్టు 4-3గోల్స్ తేడాతో మలేషియా పై సంచలనం విజయం సాధించింది. తొలి క్వార్టర్‌లో జుగ్‌రాజ్ సింగ్ పెనాల్టీని గోల్‌గా మలచడంతో భారత్ 1-0తో ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత రెండో క్వార్టర్‌లో మలేషియా జట్టు భారత్ గోల్‌పోస్ట్‌పై వరుసగా దాడులు చేసింది. ఆ క్వార్టర్‌లో ప్రత్యర్థిజట్టు వరుసగా మూడు గోల్స్ చేయడంలో భారత్ 1-3గోల్స్‌తో వెనుకబడింది. ఆ మూడో క్వార్టర్‌లో సుఖ్‌జీత్(43, 45వ ని.) వరుసగా రెండు గోల్స్ చేయడంతో ఆ క్వార్టర్ ముగిసేసరికి భారత్ 3-3గోల్స్‌తో సమంగా నిలిచింది. ఆ తర్వాత ఇరుజట్లు హోరాహోరీగా తలపడగా.. డిఫెన్స్‌లోనూ అద్భుతంగా రాణించాయి. ఆ తర్వాత 54వ ని.లో భారత్‌కు ఓ పెనాల్టీ లభించగా... హర్మన్‌ప్రీత్ గోల్ చేయడంలో విఫలమయ్యాడు. 56వ ని.లో ఆకాశ్ దీప్ ఒక ఫీల్డ్ గోల్ చేయడంతో భారత్ 4-3గోల్స్‌తో ఆధిక్యతలో నిలిచింది. లీగ్ దశ నుంచి భారత్ అప్రతిహత విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చి ఫైనల్లో మలేషియాపై సంచలన విజయం సాధించి రికార్డుస్థాయిలో 4వ సారి ఈ టైటిల్‌ను ముద్దాడింది.





ఆస్ట్రేలియా సంచలనం

తొలిసారి ప్రపంచకప్ సెమీస్‌కు 16న ఇంగ్లండ్‌తో ఢీ

సిడ్నీ: ఫిఫా మహిళల ప్రపంచకప్ సెమీఫైనల్లోకి ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్‌ను ఓడించి తొలిసారి సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో నిర్ణీత, అదనపు సమయం పూర్తయ్యే సరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో తొలి ఐదు గోల్స్‌ను ఇరుజట్లు చేయడంతో షూట్ ఆఫ్‌ను నిర్దేశించగా.. ఆస్ట్రేలియా 7-6తో గెలిచి సెమీస్ బెర్తు ఖాయం చేసుకుంది. యువ ఫుట్‌బాలర్ విక్కీ బెచో గోల్ కొట్టడంతో ఆసీస్ జట్టు సెమీస్ బెర్తు దక్కించుకుంది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 75,784మంది ప్రేక్షకులు హాజరుకావడం విశేషం.

ఉత్కంఠపోరులో ఇంగ్లండ్ గెలుపు..

ఇంగ్లండ్-కొలంబియా జట్ల మధ్య జరిగిన నాల్గో, చివరి క్వార్టర్‌ఫైనల్లో ఇంగ్లండ్ జట్టు కొలంబియాకు ఝలక్ ఇచ్చింది. కొలంబియా తరపున తొలి గోల్‌ను లెయిసీ సాంటోస్(44వ ని.) చేసినా.. ఇంగ్లండ్ క్రీడాకారిణి లారెన్ హెంప్ తొలి అర్ధభాగం అదనపు సమయం(45+6వ ని.) చేసింది. దీంతో అర్ధభాగం ముగిసేసరికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. రెండో అర్ధభాగం 63వ ని.లో రూసో గోల్ చేయగా.. ఆ తర్వాత కొలంబియా చేసిన దాడులను ఇంగ్లండ్ డిఫెండర్లు సమర్థవంతంగా నిలువరించారు. దీంతో ఇంగ్లండ్ జట్టు మూడోసారి ప్రపంచకప్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీస్‌కు చేరిన నాలుగుజట్లు టాప్-10లో ఉన్న జట్లే కావడం విశేషం. స్వీడన్(3), స్పెయిన్(6), ఆస్ట్రేలియా(10)వ స్థానాల్లో ఉన్నాయి. 16న(బుధవారం) జరిగే రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ జట్టు ఆతిథ్య ఆస్ట్రేలియాతో తలపడనుంది.



సిఎం స్టాలిన్‌కు ధన్యవాదాలు

రజనీకాంత్ నటించిన 'జైలర్' తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వీక్షించారు. చిత్ర దర్శకుడితో మాట్లాడారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ నెల్సన్ ట్వీట్ చేశారు. "జైలర్‌ను వీక్షించిన ముఖ్యమంత్రి స్టాలిన్ సర్‌కు ధన్యవాదాలు. మీ ప్రశంసలు నాలో స్ఫూర్తి నింపాయి. చిత్రబృందం మొత్తం ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. సినిమా విజయం పట్ల మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. సినిమాపై ప్రేక్షకులు చూపిస్తోన్న అభిమానానికి ధన్యవాదాలు చెప్పారు.

'పిజ్జా3' ట్రైలర్ విడుదల



'పిజ్జా3' తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇటీవలే తమిళంలో విడుదలైన 'పిజ్జా3' విజయాన్ని అందుకుంది. అశ్విన్ కాకుమణి, పవిత్ర మరిముత్తు ప్రధాన పాత్రలలో మోహన్ గోవింద్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని సొంతం చేసుకున్న కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్పీ త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు.

నాన్న ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు

శ్రుతి హాసన్



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే కమల్ హాసన్ సినీ రంగ ప్రవేశం చేసి 63 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. హీరోయిన్ శ్రుతిహాసన్ తన తండ్రి సినీ కెరీర్‌పై ట్వీట్ చేశారు. కమల్ హాసన్ అభిమానులు ఎడిట్ చేసిన ప్రత్యేక ఫొటోను పంచుకున్న శ్రుతి హాసన్.. "నాన్న తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. ఛాలెంజింగ్ పాత్రలు చేశారు. సినీ పరిశ్రమ ఎదుగుదల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. ఆరు దశాబ్దాలుగా సినీరంగానికి తన సేవలను అందిస్తున్నారు" అని పేర్కొన్నారు. కమల్ హాసన్ ఇప్పటి వరకు 230కు పైగా చిత్రాల్లో నటించారు. 'ఇండియన్ 2' విడుదలకు సిద్ధమవుతోంది.

18 నుంచి 'డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా'

సంతానం, సురభి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా'. 'భూతాల బంగ్లా' పేరుతో తమిళంలో జులై 29న విడుదలై విజయాన్ని అందుకుంది. దీనిని తెలుగులో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాతలు ఆర్ బి చౌదరి, ఎన్ వి ప్రసాద్ 'డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా" పేరుతో ఈనెల 18న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో యూనిట్ తెలుగు ట్రైలర్‌ని లాంచ్ చేసింది.

పుతుప్పళ్ళి ఉప ఎన్నికల్లో సిపిఎం పోటీ

- అభ్యర్థిగా విద్యార్థి ఉద్యమ నేత థామస్



తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మరణంతో ఖాళీ అయిన పుతుప్పళ్లీ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సిపిఎం ప్రకటించింది. విద్యార్థి ఉద్యమ నేత జైక్ సి థామస్‌ను ఆ పార్టీ బరిలో నిలిపింది. సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ శనివారం కొట్టాయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చే నెల 5 జరగనున్న ఈ ఉప ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, కొట్టాయం జిల్లా కమిటీ సభ్యులు జైక్ సి.థామస్ పోటీ చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో భావోద్వేగాల ఎరలో ప్రజలు పడిపోరాదని గోవిందన్ అన్నారు. ఈ ఎన్నికను ఎల్‌డిఎఫ్ రాజకీయంగా ఎదుర్కొంటుందన్నారు. సిపిఎంను అప్రతిష్టపాల్జేయడానికి మీడియా అసత్యాలను, పుకార్లను వ్యాప్తి చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. గత 53 సంవత్సరాలుగా ఊమెన్ చాందీ ఈ నియోజకవర్గానికి నాయకత్వం వహిస్తూ వచ్చారు. ఊమెన్ చాందీ కుమారుడు ఇక్కడ పోటీ చేస్తారని కొద్ది రోజుల క్రితమే కాంగ్రెస్ ప్రకటించింది.

ఉత్తరాఖండ్‌లో విషాదం

- కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి

డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్) : కొండచరియలు విరిగిపడటంతో ఐదుగురు యాత్రికులు మృతి చెందిన ఘటన ఉత్తరాఖండ్‌లో జరిగింది. కొద్దిరోజులుగా ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు కురుస్తున్నాయి. యాత్రికులు కేథార్‌నాథ్‌కు వెళుతున్న క్రమంలో రుద్రప్రయాగ జిల్లాలో చౌకీ ఫటాలోని టార్సిల్ ప్రాంతం వద్ద రోడ్డుపై వెళుతున్న ఓ కారుపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు యాత్రికులు అక్కడికక్కడే మరణించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. యాత్రికుల్లో ఒకరు గుజరాత్‌కు చెందినవారిగా గుర్తించారు. ఈ ఘటనతో గుప్తకాశి-గౌరీకుండ్ గుండా కేదార్‌నాథ్ దామ్‌కు వెళ్లే జాతీయ రహదారిపై రాకపోకలను ఆపేశారు. ఉత్తరాఖండ్‌లో వానలు కురుస్తుండటంతో అధికారులు ఆగస్టు 11 నుంచి ఆగస్టు 24 వరకు కొన్ని జిల్లాల్లో రెడ్ అలర్ట్ ను ప్రకటించారు. పోలీసులు మాట్లాడుతూ ... వర్షాల వేళ ... గుప్తకాశి-గౌరీకుండ్ గుండా కేదార్‌నాథ్ దామ్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అన్వర్ ఉల్ హక్



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానిగా సెనెటర్ అన్వర్ ఉల్ హక్ కాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది చివరిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల క్రమాన్ని ఆయన పర్యవేక్షిస్తారు. ప్రధాని హెహబాజ్ షరీఫ్, ప్రతిపక్ష నేత రాజా రియాజ్‌లు రెండు రౌండ్ల చర్చలు జరిపిన తర్వాత అన్వర్ పేరును ఖరారు చేశారు. బెలూచిస్తాన్ అవామీ పార్టీ (బిఎపి)కి చెందిన కాకర్‌ను ఆపద్ధర్మ ప్రధానిగా నియమించడానికి అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి ఆమోద ముద్ర వేశారు. చిన్న ప్రావిన్స్ నుండి వచ్చిన వ్యక్తి తాత్కాలిక ప్రధానిగా వుండాలని నిర్ణయించినట్లు రియాజ్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కాకర్ పేరును తాను ప్రతిపాదించానని, దాన్నే ఆమోదించారని చెప్పారు. ఈ నెల 9న పాక్ నేషనల్ అసెంబ్లీని రద్దు చేశారు. ఇక్కడ నుండి 90 రోజుల్లోగా ఎన్నికలు జరగాల్సి వుంది. అయితే కొత్త జనాభా లెక్కల కారణంగా కొద్ది నెలలు ఎన్నికల నిర్వహణలో జాప్యం జరగవచ్చునని భావిస్తున్నారు.



చెన్నైలో నిర్వహించిన ర్యాలీలో బెఫి అగ్ర నాయకత్వం



జెండా ఆవిష్కరిస్తున్న బెఫి అధ్యక్షులు సిజె నందకుమార్

ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

బెఫి సదస్సు ప్రారంభోత్సవంలో తపన్‌సేన్

చెన్నై : ప్రభుత్వ రంగాన్ని మొత్తంగా నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణను పెద్ద ఎత్తున అమలు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా వుందని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకించాల్సిందిగా పిలుపునిచ్చారు. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఇఎఫ్ఐ-బెఫి) 11వ అఖిల భారత సదస్సును తపన్‌సేన్ ఇక్కడ ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. దేశ ఆర్థిక రంగ వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వం పాల్పడుతున్న నేరాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం కార్మికవర్గం కర్తవ్యమని తపన్‌సేన్ అన్నారు. 1991లో సరళీకత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ ప్రజా వ్యతిరేక విధానాలు ముమ్మరమయ్యాయన్నారు. 1960వ దశకంలో అమలు చేయబడిన బ్యాంకులు, మరియు బీమా సంస్థల జాతీయీకరణ వంటి ప్రయోజనకరమైన నిర్ణయాలకు నేడు ఎదురుదెబ్బ తగిలిందన్నారు. బ్యాంకింగ్ రంగంలో కొత్త సంస్కరణలను వేగంగా అమలు చేయడంతో బ్యాంకుల స్వరూపమే మారిపోయిందని అన్నారు.

సదస్సు ప్రారంభోత్సవానికి ముందు నగరంలోని వైఎంసిఏ నుంచి సదస్సు జరిగే సభా స్థలి వరకు జరిగిన ర్యాలీలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. బెఫి అఖిల భారత అధ్యక్షులు సిజె నందకుమార్ జెండాను ఎగురవేశారు. అనంతరం అమరవీరుల మండపం వద్ద పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. ప్రారంభ సభకు నందకుమార్ అధ్యక్షత వహించారు. నిర్వాహక కమిటీ వైస్ చైర్మన్ సింగరవేలన్ స్వాగతం పలికారు. ఈ సదస్సు సందర్భంగా సంస్థ తొలితరం నాయకులు, మాజీ ఆఫీస్ బేరర్లను సన్మానించారు. బ్యాంకింగ్ మరియు బ్యాంకింగ్‌యేతర రంగాలకు చెందిన ట్రేడ్ యూనియన్ నాయకులు మరియు ప్రజా సంఘాల నాయకులు ప్రారంభ సభలో ప్రసంగించారు. బెఫి తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ కతజ్ఞతలు తెలియచేశారు. ఈ సదస్సు సోమవారం వరకు కొనసాగనుంది.

జనరిక్ మందులు రాయకపోతే

వైద్యులపై కఠిన చర్యలు

- ఎన్ఎంసిఆర్ఎంపి కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ : వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు చౌకగా లభించే జనరిక్ ఔషధాలను రాయాలని నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఎన్ఎంసిఆర్ఎంపి) ఆదేశాలు జారీ చేసింది. లేదంటే వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సివుంటుందని, అవసరమైతే లైసెన్సు కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఎన్ఎంసిఆర్ఎంపి కొత్త నిబంధనావళిని జారీ చేసింది.

కాగా, దేశంలోని ప్రతి వైద్యుడు జనరిక్ మందులనే ప్రిస్క్రైబ్ చేయాలని 2002లోనే భారత వైద్య మండలి (ఐఎంసి) నిబంధనలు చేసింది. కానీ ఇందుకు భిన్నంగా వ్యవహరించే వైద్యులపై ఎలాంటి చర్యలను అందులో ప్రస్తావించలేదు. దీంతో తాజాగా ఆ నిబంధనల స్థానంలో ఎన్ఎంసిఆర్ఎంపి నియమావళి-2023 అమల్లోకి తెచ్చినట్లు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. ఇందులో నిబంధనలను పాటించని వైద్యులపై చర్యలను కూడా పేర్కొన్నారు. నిబంధనావళిలోని కీలక అంశాలు..



- ప్రతి రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్ తమ వద్దకు వచ్చే రోగులకు జనరిక్ పేర్లతో ఔషధాలను రాయాలి.
- అనవసర మందులు, అహేతుకమైన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ట్యాబ్లెట్లను సూచించరాదు
- నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే.. సదరు వైద్యులను హెచ్చరించడంతో పాటు వర్క్‌షాపులకు హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేస్తారు.
- ఒకవేళ పదే పదే నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే.. ఆ వైద్యుడి లైసెన్సును కొంతకాలం పాటు నిలిపివేస్తారు.
- మందుల చీటీలో ఔషధాల పేర్లను క్యాపిటల్ అక్షరాల్లో రాయాలని జాతీయ వైద్య కమిషన్ ఆ నిబంధనల్లో పేర్కొంది.
- బ్రాండెడ్ ఔషధాలతో పోలిస్తే జనరిక్ మందుల ధరలు 30 నుంచి 80 శాతం తక్కువగానే ఉన్నాయి. వైద్యులు జనరిక్ మందులనే ప్రిస్క్రైబ్ చేయడం వల్ల వైద్య ఖర్చులు తగ్గడంతో పాటు అందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించినట్లవుతుంది.

ఆ 183 ఎన్‌కౌంటర్ల వివరాలివ్వండి

- యుపి ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు
- కేసుల పెరుగుదలపై న్యాయస్థానం ఆందోళన

న్యూఢిల్లీ: యూపీలో యోగి పాలనలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. యూపీలో 2017 నుంచి ఇప్పటి వరకు జరిగిన 183 ఎన్‌కౌంటర్‌లకు సంబంధించిన విచారణ, దర్యాప్తు స్థితిగతులను వివరించే అఫిడవిట్‌ను సమర్పించాలని సుప్రీంకోర్టు.. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్‌ల పోలీసు కస్టడీ మరణాలపై విచారించేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా.. కేసుకు మించిన పరిధిని విస్తరించినట్లు కోర్టు వెల్లడించింది. ఇటు యూపీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో కూడా పెరుగుతున్న పోలీసు ఎన్‌కౌంటర్‌లు, కస్టడీ మరణాల సంఘటనలపై జస్టిస్ ఎస్‌ఆర్ భట్ నేతృత్వంలోని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలపై దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించడానికి క్రియాత్మక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

ఇంటర్నెట్ బంద్‌కు వంద రోజులు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల ఘర్షణలు చెలరేగి శనివారం నాటికి నూట ఒక్క రోజులు కావస్తోంది. అప్పటి నుంచి ఇంటర్నెట్ సేవలను బిజెపి ప్రభుత్వం నిలిపివేసింది. నేటికి వంద రోజులైనా నిషేధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇంటర్నెట్ సేవల పాక్షిక పునరుద్ధరణ కోసం హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఆదేశించింది. పాక్షిక పునరుద్ధరణ రాష్ట్ర జనాభాలో చాలా తక్కువ మంది అవసరాలను మాత్రమే తీరుస్తుంది.

ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను నిరవధికంగా కొనసాగించడాన్ని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ ఖండించింది. "మణిపూర్ పౌరులు తమ ప్రాథమిక మానవ హక్కులను కోల్పోతున్నారు" అని ఫౌండేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. రీసెర్చ్ అండ్ అడ్వకేసీ ఆర్గనైజేషన్ ఈ నిరవధిక షట్‌డౌన్ పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు తాము విన్నదానిని స్వతంత్రంగా నిర్ధారించుకునే అవకాశం లేకుండాపోతుందని తెలిపింది.

మణిపూర్ పౌరులు వారి ప్రాథమిక మానవ హక్కులను ఎలా కోల్పోతున్నారో చూశాక మనసు చివుక్కుమందని ఫౌండేషన్ పేర్కొంది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనేనని, దీనికి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేసింది.

మే 3న విధించిన ఇంటర్నెట్ యాక్సెస్ సస్పెన్షన్‌ను విధించింది. జులై 25న బ్రాడ్‌బ్యాండ్ సేవలను కొంతమేర సడలించింది. అయితే ఈ బ్రాడ్‌బ్యాండ్ (ఇంటర్నెట్ లీజుకు తీసుకున్న లైన్ మరియు ఇంటికి ఫైబర్) ను వినియోగిస్తున్నది కేవలం 3 శాతం మాత్రమే. అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఇలా పేర్కొంది. ఇంటర్నెట్ సేవలపై ఏవైనా ఆంక్షలు విధిస్తే పదిహేను రోజులకు మించి ఉండకూడదని చట్ట నిబంధనలు చెబుతున్న విషయాన్ని గుర్తు చేసింది.

ఇంటర్నెట్ సేవల పాక్షిక పునరుద్ధరణకు కూడా ప్రభుత్వం అనేక షరతులు పెట్టింది. మొబైల్ డేటా సేవలు నిలిపివేయబడ్డాయి. బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు స్థానిక స్థాయిలో సోషల్ మీడియా వెబ్‌సైట్ల నిలిపివేతను కొనసాగించింది.

మణిపూర్ పౌరుల్లో అత్యధికులకు ఇంటర్నెట్ సేవలు గత వంద రోజులుగా నిలిచిపోవడంతో ఆరోగ్య సంరక్షణ, విద్య, బ్యాంకింగ్ సేవలు స్తంభించిపోయాయి. జీవనోపాధి దెబ్బతింది. అంతిమంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే స్థితి ఏర్పడింది. ఇంటర్నెట్ షట్‌డౌన్ ప్రభావం ఉపాధిపై ఎలా ఉంటుందో హ్యూమన్ రైట్స్ వాచ్, ఐఎఫ్‌ఎఫ్ సంయుక్త నివేదిక వెల్లడించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకాలపై ఆధారపడిన కార్మికులు, ఇంటర్నెట్ సస్పెన్షన్ కారణంగా ప్రభుత్వ యాప్‌లో తమ హాజరును గుర్తించలేక వేతనాలను కోల్పోయిన ఉపాధి కూలీల పరిస్థితిని ఆ నివేదిక బయటపెట్టింది.

అంతేకాదు, ఇంటర్నెట్ షట్‌డౌన్ వల్ల వాస్తవిక సమాచారం తెలుసుకునే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. మణిపూర్ వెలుపల ఉన్న ప్రజలకు రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలియక తీవ్ర ఆందోళనతో ఉన్నారు. శాంతిభద్రతల సమస్యలను నివారించడంలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను ప్రభుత్వం ఇలా నిరవధికంగా కొనసాగించడం దారుణమని పలువురు నిపుణులు పేర్కొన్నారు.

బ్రిజ్ భూషణ్ బాధితులను పరామర్శించండి

- స్మృతి ఇరానీకి రాబర్ట్ వాద్రా హితవు

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీపై కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంపై ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీతో రాబర్ట్ వాద్రాకు సన్నిహిత సంబంధాలున్నాయంటూ అదానీతో ఆయన కలిసివున్న ఒక ఫొటోను లోక్‌సభలో స్మృతీ ఇరానీ చూపించారు. దీనిపై శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ అదానీతో తనకు సన్నిహిత సంబంధాలుంటే నిరూపించాలని సవాలు విసిరారు. ఒకవైపు మణిపూర్ మండిపోతుంటే, మరోవైపు పార్లమెంట్‌లో తన గురించి వ్యతిరేకంగా ఆమె (స్మృతీ ఇరానీ) మాట్లాడటం సిగ్గుచేటు అని ఆయన పేర్కొన్నారు. 'బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించినట్లు అనేక మంది రెజర్లు ఆరోపిస్తున్నారు. ముందు వెళ్లి వారిని పరామర్శించండి. మాపైన ఏడవడం కాదు' అని ఆయన వాపోయారు. పార్లమెంట్ వ్యవహారాలకు తాను దూరంగా ఉంటానని, అయితే గత తొమ్మిదేళ్లుగా కేంద్రం ఇరుకునపడిన సందర్భాల్లో తన పేరును వినియోగిస్తూనేవుందని ఆయన పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు గట్టి పోటీ ఇస్తామని చెప్పారు. తన భార్య ప్రియాంక గాంధీ పార్లమెంట్‌లో ఉండాలని కోరుకుంటున్నానని, ఈ దిశగా కాంగ్రెస్ ప్లాన్ చేస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

టీనేజర్లలో ఇంటర్‌నెట్ వ్యసనానికి తల్లిదండ్రుల వైఖరే కారణం !

- కోవిడ్ తర్వాత కొత్తగా తలెత్తిన ఆరోగ్య పరమైన ముప్పు ఇదే
- నిమ్‌హాన్స్ అధ్యయనంలో వెల్లడి

బెంగళూరు : కౌమార వయస్సులోని పిల్లలు మితిమీరి ఇంటర్‌నెట్‌ను వాడుతున్నారంటే అందుకు ప్రధాన కారణం వారి తల్లిదండ్రుల వ్యవహార శైలేనని నిమ్‌హాన్స్ (బెంగళూరుకు చెందిన జాతీయ మానసిక ఆరోగ్యం, న్యూరో సైన్సెస్‌కి చెందిన సంస్థ) కు చెందిన పరిశోధకులు జరిపిన కొత్త అధ్యయనంలో వెల్లడైంది. తల్లిదండ్రులు-కౌమార వయస్సులోని పిల్లల మధ్య గల సంబంధాలను ప్రభావితం చేసే అంశాలపై వారు అధ్యయనం చేశారు. అంతర్జాతీయ సోషల్ సైకియాట్రి జర్నల్‌లో గత వారం ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.

తగ్గిన సంరక్షణ, తల్లి ఎక్కువగా అదుపులో పెట్టడానికి చూడడం, తండ్రి అధిక స్వేచ్ఛను ఇవ్వడం, తల్లిదండ్రులు ఇరువురు నుండి పెరిగే వ్యతిరేకత, తిరస్కృతి ఇవన్నీ కూడా ముప్పు కారకాలుగా వుంటాయని అధ్యయనంలో వెల్లడైందని పరిశోధక బృందానికి నాయకత్వం వహించిన, నిమ్‌హాన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ బినో థామస్ పేర్కొన్నారు. కౌమార వయస్సులోని పిల్లలు మితిమీరి ఇంటర్‌నెట్ వినియోగించడానికి ఇవి దోహదపడతాయన్నారు.

కోవిడ్ తర్వాత పిల్లల్లో ముఖ్యంగా టీనేజ్ వయస్సులోని పిల్లల్లో ఇంటర్‌నెట్ వ్యసనమన్నది కొత్తగా తలెత్తిన ఆరోగ్యపరమైన ముప్పుగా మారిందని అధ్యయన నివేదిక పేర్కొంది. ఒక కుటుంబ వాతావరణంలో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల వ్యవహరించే తీరు - ప్రధానంగా పిల్లలు ఇంటర్‌నెట్‌ను ఎక్కువగా ఉపయోగించడంలోనూ లేదా ఇంటర్‌నెట్ వ్యసనం నుండి టీనేజర్లను కాపాడడంలోనూ - ముఖ్య పాత్ర వహిస్తాయని డాక్టర్ థామస్ పేర్కొన్నారు.

ఈ అధ్యయనం కోసం బెంగళూరు పట్టణ ప్రాంతాల్లోని రెండు వేర్వేరు పాఠశాలలకు చెందిన 13 నుండి 18 ఏళ్ళ వయస్సులోని 102 మందితో మాట్లాడారు. వీరిలో దాదాపు సగం మంది ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయి వరకు ఇంటర్‌నెట్ వ్యసనం బారిన పడ్డారు. మిగిలిన సగం మంది సాధారణ స్థాయిలో ఇంటర్‌నెట్ వినియోగిస్తున్నారు. పిల్లలను అదుపులో పెట్టడం, లేదా వారిని పూర్తిగా వదిలివేయడమనేది ప్రధానంగా పెద్దగా చదువుకోని తల్లిదండ్రుల్లో ఎక్కువగా వుంటుందని నివేదిక పేర్కొంది. అయితే తల్లిదండ్రుల వ్యవహార శైలి, వారి వైఖరితో పాటూ ఇతరత్రా అంశాలు అంటే భావోద్వేగభరితమైన సమస్యలు కూడా పిల్లలపై ప్రభావాన్ని చూపిస్తాయా లేదా అని మరింతగా దర్యాప్తు చేయాల్సిన అవసరముందని పరిశోధకుల బృందంలోని డాక్టర్ శర్మ పేర్కొన్నారు.

రచయిత, సంపాదకులపై మణిపూర్‌లో కేసు

ఇంఫాల్ : 2018లో ప్రచురించబడిన ఓ పుస్తకం రాష్ట్ర చరిత్రను వక్రీకరిస్తోందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు మణిపూర్ పోలీసులు ఒక రచయిత, ఇద్దరు సంపాదకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రిటైర్డ్ కల్నల్ డాక్టర్ విజయ్ చెంజీ ఈ పుస్తకాన్ని రాశారు. దీనిని జేఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాంగ్‌ఖోమాంగ్ గూటే, థాంకోలాల్ హాకిప్ సవరించారు. చెంజీపై ఈ నెల 9న, మిగిలిన ఇద్దరిపై ఈ నెల 7న ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ పుస్తకంలో 1917-1919 కాలంలో జరిగిన కుకీ తిరుగుబాటును ఆంగ్లో-కుకీ యుద్ధంగా చిత్రించారని, తద్వారా తప్పుడు కథనాన్ని సృష్టించి శాంతికి విఘాతం కలిగించారని ఫిర్యాదులో ఆరోపించారు. బ్రిటన్ దళాలకు, కుకీలకు మధ్య ఎన్నడూ యుద్ధమే జరగలేదని ఫిర్యాదుదారులు తెలిపారు. కుకీ తిరుగుబాటు కారణంగా కొండ ప్రాంతంలో నాగాలు ఊచకోతకు గురయ్యారని, లోయలో మైతీలు, ముస్లింలను చంపేశారని వారు వివరించారు. దీంతో వివిధ సెక్షన్ల కింద పుస్తక రచయిత పైన, సంపాదకుల పైన ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.


'ఇండియా'పై మళ్లీ దుమ్మెత్తిపోసిన మోడీ

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో తనపై తెచ్చిన అవిశ్వాస తీర్మానంలో ఓటింగ్‌కి ప్రతిపక్షాల కూటమి (ఇండియా) భయపడిపోయిందని ప్రధాని నరేంద్రమోడీ మళ్లీ దుమ్మెత్తిపోశారు. శనివారం పశ్చిమబెంగాల్‌లో జరుగుతున్న క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్' సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మేము పార్లమెంట్‌లో ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానాన్ని ఓడించాము. దేశంలో బిజెపిపై దుష్ప్రచారం చేసేవారికి తగిన సమాధానం ఇచ్చాము. ప్రతిపక్ష సభ్యులు పార్లమెంటును మధ్యలోనే వదిలేసి వెళ్లారు. వాస్తవానికి నిజం ఏమిటంటే అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ప్రతిపక్షాలు భయపడ్డాయి. ఓటింగ్ జరిగి ఉంటే ఇండియా కూటమి బట్టబయలు అయ్యేది.' అని ఆయన అన్నారు. కాగా, కొన్నిరోజుల క్రితం హర్యానాలోని 'స్థానీయ స్వరాజ్' ప్రతినిధులతో సంభాషించే అవకాశం లభించింది. ఆ తర్వాత బెంగాల్‌లో 'క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్' ప్రతినిధులతో మాట్లాడే అవకాశం లభించింది అని మోడీ అన్నారు. ఈ పంచాయతీరాజ్ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా పాల్గొన్నారు.

హవాయిలో ఎటుచూసినా

హృదయ విదారక దృశ్యాలే

- కార్చిచ్చు ధాటికి తల్లడిల్లుతున్న చారిత్రక నగరం
- 80కి పెరిగిన మృతుల సంఖ్య



లాహైనా, హవాయి : హవాయిలోని మౌయి ద్వీపంలో ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి మొదలైన కార్చిచ్చు పెనుబీభత్సం సృష్టించింది. ఇప్పటి వరకు 80 మంది వరకు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. శతాబ్దాల నాటి నగరమైన లాహైన్‌లో ఎక్కడ చూసినా శిథిలాల కుప్పలు కనిపిస్తున్నాయి. విషాద మేఘాలు కమ్ముకున్నాయి. ఇంకా ఎవరైనా శిథిలాల కింద చిక్కుకుపోయారేమోనని సహాయ బృందాలు అన్వేషిస్తున్నాయి. అయితే సుదూర ప్రాంతంలోని తుపాను ప్రభావం కారణంగా బలమైన గాలులు వీచడంతో మంటలు చాలా వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే మంటలు చుట్టుముట్టాయి.

కార్చిచ్చు ధాటికి వేల సంఖ్యలో నివాసాలు, ఇతర భవనాలు కాలిబూడిదయ్యాయి. రోడ్డు మీద నిలిపి ఉంచిన వాహనాలు నామరూపాల్లేకుండా దగ్ధమయ్యాయి. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో పిల్లులు, పక్షులు, ఇతర జంతువులు మంటల్లో కాలిపోయాయి. కార్చిచ్చు కారణంగా వేల మంది నిరాశ్రయులయ్యారు. సర్వం కోల్పోయి తమ భవిష్యత్తు ఏంటో తెలియక అంధకారంలో కూరుకుపోయారు. దాదాపు 1500మంది అత్యవసర సహాయ శిబిరాల్లో తల దాచుకున్నారు.

ఆస్తినష్టం పరంగా హవాయి చరిత్రలోనే రెండో అతిపెద్ద విపత్తు ఇదని అధికారులు పేర్కొన్నారు. మౌయి దీవిలో ఉండే ఈ పట్టణానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఒకప్పుడు హవాయిన్ రాజ కుటుంబం ఇక్కడ నివసించింది. ప్రస్తుతం ఇక్కడ 12వేల మంది నివాసముంటున్నారు. పర్యాటకంగానూ ఈ నగరం ప్రత్యేకమైనది. ఈ వారంలో మౌయి ద్వీపంలో మూడు దావానలాలు చెలరేగాయి. మంటలు చెలరేగి మూడు రోజులు గడిచినా ఇంకా అక్కడక్కడ మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. అయితే తమ ఇళ్ళకు జరిగిన నష్టాన్ని అంచనా వేసుకునేందుకు, ఇంకా ఏమైనా మిగిలితే తీసుకెళ్ళేందుకు ప్రజలను అనుమతించారు. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. కాగా ప్రజలను మంటల గురించి హెచ్చరిస్తూ వార్నింగ్ బెల్స్ కూడా మోగలేదని చెబుతున్నారు. దీనిపై దర్యాప్తు జరపనున్నట్లు హవాయి అటార్నీ జనరల్ తెలిపారు.

నైగర్‌పై దాడికి యోచన!

- త్వరలో పశ్చిమాఫ్రికా దేశాల సైన్యాధిపతుల భేటీ

నియామె : నైగర్‌పై దాడి చేయడానికి గల అవకాశాల గురించి చర్చించడానికి త్వరలో సమావేశమవ్వాలని పశ్చిమ ఆఫ్రికా ప్రాంతీయ కూటమి ఎకోవాస్ బ్లాక్‌కి చెందిన దేశాల సైన్యాధ్యక్షులు భావిస్తున్నారు. జులై 26వ తేదీన నైగర్‌లో అధికారాన్ని అక్రమంగా స్వాధీం చేసుకున్న సైన్యాధిపతిని పదవి నుండి తొలగించేందుకు సాయుధ జోక్యం అవసరమంటూ నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టింబు పార్లమెంట్‌ను కోరారు. అయితే, నైజీరియా పార్లమెంట్ దీనిని తిరస్కరించింది. నైగర్‌లో ప్రభుత్వాన్ని పునరుద్ధరించాలని పశ్చిమాఫ్రికా ప్రాంతీయ బ్లాక్ ఎకోవాస్ ఇప్పటికే అల్టిమేటమ్ జారీ చేసింది. నైగర్ సైన్యంలో దాదాపు 5వేల మంది సైనికులు వున్నారు.

అయితే, ఏయే దేశాలు సాయం చేయడానికి ముందుకు వస్తాయనేది ఇంకా స్పష్టం కాలేదు. తాము 850మంది సైనికులను పంపిస్తామని ఐవరీ కోస్ట్ ఒక్కటే ఇప్పటివరకు ప్రకటించింది. ఒక బెటాలియన్‌ను పంపి, అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు అందచేయనుంది. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు మహ్మద్ బజూమ్‌ను తిరిగి పదవిలో కూర్చోబెట్టేందుకు కృత నిశ్చయంతో వున్నామని ఐవరీ కోస్ట్ అధ్యక్షుడు తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్ ఆ ప్రకటనకు మద్దతునిచ్చింది. అయితే నియామె వీధుల్లో సైనిక ప్రభుత్వానికి మద్దతుగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. 'ఇది మా సొంత వ్యవహారం, వారిది కాదు' అని సైనిక ప్రభుత్వ మద్దతుదారుడు ఒకరు వ్యాఖ్యానించారు. సైనిక తిరుగుబాటు ఎందుకు జరిగిందో వారికి తెలియదని అన్నారు. ఒకవేళ ఎకోవాస్ బ్లాక్ దాడి చేసినట్లైతే తాము నైగర్‌కు సాయంగా వస్తామని పొరుగుదేశాలైన మాలి, బుర్కినా ఫాసోలు ప్రకటించాయి. విదేశీ శక్తులు దాడి చేస్తే ప్రస్తుతం గృహ నిర్బంధంలో వున్న అధ్యక్షుడు మహ్మద్ బెజూమ్‌ను చంపేస్తామని జుంటా ప్రతినిధులు అమెరికా విదేశాంగ శాఖ సహాయ మంత్రి విక్టోరియా నూలాండ్‌కి చెప్పారని అమెరికన్ అధికారి ఒకరు చెప్పారు.

అమల్లోకి 'డేటా' చట్టం

- దీంతో పాటు ఢిల్లీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐటి రంగ నిపుణులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేసిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు చట్టంగా మారింది. ఈ బిల్లుతో పాటు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఢిల్లీ సర్వీసుల బిల్లుకు కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు శనివారం నాడు రాష్ట్రపతి బిల్లుపై సంతకం చేశారు. దీంతో బిల్లు చట్టరూపం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఢిల్లీ సర్వీసుల బిల్లును ఆగస్టు 3న మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభలో ఆగస్టు 7న ఈ బిల్లు ఆమోదం పొందింది. అలాగే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుకు కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ బిల్లు కూడా చట్టరూపం దాల్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

మందబలంతో...పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లులే అధికం

లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో ఢిల్లీ సర్వీసులు, డేటా ప్రొటెక్షన్ వంటి వివాదాస్పద బిల్లులు సహా మొత్తం 22 బిల్లులను ఆమోదించారు. అయితే వీటిలో పది బిల్లులపై కనీసం గంట చొప్పున కూడా చర్చ జరగకపోవడం గమనార్హం. కొన్ని బిల్లులను నిమిషాల వ్యవధిలోనే ఆమోదించేశారు. ఢిల్లీ సర్వీసుల బిల్లుపై మాత్రం దాదాపు ఐదు గంటల పాటు చర్చ జరిగింది. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాలను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను చివరి రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టారు. 2019లో 17వ లోక్‌సభ ఏర్పడినప్పటి నుండీ పని గంటలు క్రమేపీ తగ్గిపోతున్నాయి. నిర్ణయించుకున్న సమయంలో సగం కంటే తక్కువే పని చేసినప్పటికీ లోక్‌సభ వర్షాకాల సమావేశాలలో 25 బిల్లులను ప్రవేశపెట్టి 22 బిల్లులను ఆమోదించారు. 2019 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో బిల్లులను ఆమోదించిన సందర్భాలు రెండే ఉన్నాయి. 2019 బడ్జెట్ సమావేశాలలో 35 బిల్లులు, 2020 వర్షాకాల సమావేశాలలో 25 బిల్లులు ఆమోదం పొందాయి. ఈ సారి రాజ్యసభ 25 బిల్లులను ఆమోదించింది. 17వ పార్లమెంట్ తొలి సమావేశాలలో 29 బిల్లులు ఆమోదం పొందాయి. ఆ తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఎగువసభలో బిల్లులు ఆమోదం పొందడం ఈ సమావేశాలలోనే జరిగింది. దిగువసభతో పోలిస్తే ఎగువసభలో ప్రవేశపెట్టిన బిల్లుల సంఖ్య తక్కువే. లోక్‌సభ సమావేశాలలో 22 బిల్లులు ఆమోదం పొందినప్పటికీ వాటిపై చర్చ జరిగింది మొత్తంగా 14 గంటలే. అన్ని కార్యకలాపాలు కలిపి లోక్‌సభ 43 గంటల పాటు నడిచింది.



మీకోసం

యాలకుల పొడి నీళ్లల్లో కలిపి ప్రతి రోజూ తాగుతూ ఉంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

జీవన సౌరభం


ప్రశ్నించనిదే సమాధానం దొరకదు..
ప్రయత్నించనిదే విజయమూ దక్కదు.

స్వాతంత్ర్యం

స్వాతంత్రము వచ్చే
జన తంత్రమే తెచ్చే
ఆంగ్ల ప్రభుత తొలగే
భారత పాలన నిలిచే

భాషలు వేరైనా
భావము ఒక్కటే
జాతులు వేరైనా
జీవనం ఒక్కటే !

మతములు వేరైనా
దేవుడు ఒక్కడే
సమరసము పలికి
గొంతెత్తి చాటెదము



ఎత్తైన కొండలు
లోతైన నదులు
పండే పంటలు
మనవే వనరులు

మువ్వన్నె పతాకము
ఎగురవేసి మనము
జేజేలు పలుకెదము
మన కీర్తి చాటెదము!

- బెహరా ఉమామహేశ్వరరావు,
92900 61336.

జెండా పండగ

జెండా పండగ వచ్చింది
ఆనందాలను తెచ్చింది
స్వేచ్ఛ కోసము చెప్పింది
దేశభక్తితో మది నిండింది

మూడు రంగుల జెండా
భారతమాతకు అండదండ
వినువీధుల్లో ఎగురుచుండ
ఆనందమే కనుల నిండా

జెండా చేత బూని
తెల్లదొరలకు ఎదురొడ్డి
వందేమాతర నినాదమే
జాతి గుండెల్లో నిండినది

స్వేచ్ఛ కోసమే ఆరాటం
త్రివర్ణ పతాకమే మనకోసం
త్యాగమూర్తుల పోరాటం
స్వాతంత్రమే మన జీవనం

గాంధీ, నెహ్రూ శాంతి మంత్రం
భగత్‌సింగ్ రక్త తర్పణం
బానిస సంకెళ్ల విముక్తి కోసం
అంచెలంచెలా పోరాటం



లాలా లజపతిరాయ్
వెన్నుచూపని ధైర్యం
బాలగంగాధర్ తిలక్
వందేమాతర ఉద్యమం

మన్యం పౌరుషం అల్లూరి
బ్రిటిష్ వెన్నులో భయంకరి
మన నేతాజీ చూసిన దారి
ఆజాద్ హింద్ ఫౌజు

సత్యాగ్రహమే ఆయుధం
సాగింది మన ఉద్యమం
ఎందరో వీరుల త్యాగఫలం
స్వతంత్ర భారత దీప్తి ధనం!

- మొర్రి గోపి,
88978 82202



నేను గీసిన బొమ్మ



వి. లోహిత,
8వ తరగతి,
అరవిందహైస్కూల్,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నేను కాకపోతే ఇంకెవ్వరు?

'వైకల్యంతో ఉన్న నాకు మా అమ్మానాన్న అండగా ఉన్నారు. అమ్మ ప్రోత్సాహంతోనే అంధుడినైనప్పటికీ చదువుకోగలిగాను' అంటున్న కర్నాటకకు చెందిన దత్తు అగర్వాల్ ఉన్నత విద్య చదివారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా 30 ఏళ్ల పాటు పనిచేశారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే... రాష్ట్రవ్యాప్తంగా అంధ బాలికల కోసం ప్రత్యేక పాఠశాల లేకపోవడం గమనించి, తానే ఒక పాఠశాల ప్రారంభించారు. తన వేతనం మొత్తాన్ని పాఠశాల నిర్వహణకు ఉపయోగించటం మొదలెట్టారు. 'మాతోశ్రీ' పేరుతో నిర్వహిస్తున్న ఆ పాఠశాలలో ఇప్పుడు 75 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు.



'సరైన ప్రోత్సాహం లేకపోతే నాలాంటి వాళ్ల పడే బాధలు ఎలా ఉంటాయో నాకు బాగా తెలుసు. నాకా పరిస్థితి లేదు. కానీ, వైకల్యంతో బాధపడుతున్న నేను కాకపోతే ఇంకెవ్వరు వారి కోసం తాపత్రయపడతారనిపించింది' అంటున్నారు దత్తు. ఆయన కల్బుర్గిలో పుట్టి పెరిగారు. బాల్యంలో ఆస్మాతో బాధపడిన ఆయన మూడేళ్ల వయసు వచ్చేసరికి కంటిచూపు కోల్పోయారు. 'ప్రపంచాన్ని గమనించేలోపే నా చూపు పోయింది. అమ్మానాన్న బాగా ఏడ్చారు. అయితే నన్ను స్వతంత్రుడిగా ఎదిగేలా ఎంతో ప్రోత్సహించారు. 8 ఏళ్లకు నన్ను స్కూలులో చేర్పించారు' అని తన బాల్యం గురించి చెప్పారాయన. దత్తు, గుల్బర్గా యూనివర్శిటీలో పొలిటికల్ సైన్స్ చదివి, 1985 నుంచి అదే యూనివర్శిటీలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడిగా పాఠాలు బోధిస్తున్నారు.

ఇల్లు, స్కూలు, కాలేజీ.. ఎక్కడా తానొక అంధుడినన్న సంగతి ఇబ్బందిపెట్టకుండా పెరిగారు దత్తు. కానీ అంధులైన ఇతరులు పడే ఇబ్బందులు గమనించేవారు. 'నువ్వింక ఏం చేయగలవు? నీకు నువ్వే భారం..' వంటి సాధారణ వెక్కిరింపుల మొదలు, మనసును మెలిపెట్టే అవమానాలెన్నింటినో వైకల్య బాధితులు ఎదుర్కొంటారు. అటువంటి వారికి నేనొక కొత్త ప్రపంచాన్ని ఇవ్వాలనుకున్నాను. ఆ ప్రపంచంలో పక్షపాతానికి స్థానం ఉండకూడదు. నా కదలికలను నేను గమనించలేకపోవచ్చు.. కానీ ఆ కదలికలే నా ఉన్నతికి, విజయానికి మార్గం వేస్తాయి అని బలంగా నమ్ముతాను. నా కమ్యూనిటీ వారు పడే బాధలు గమనిస్తున్న నాకు, ఆడపిల్లలు ఈ వైకల్యంతో ఎంత వేదన అనుభవిస్తున్నారో అన్న ఆలోచన రాగానే నిద్ర పట్టలేదు' అంటూ తన ప్రయాణం గురించి వివరించారు.

ఆ ఆలోచనతోనే ఆయన అంధ బాలికల కోసం 'మాతోశ్రీ అంబుదాల్ రెసిడెన్షియల్ స్కూలు' ప్రారంభించారు. అంతకు ముందే.. 1990ల్లో 'హైద్రాబాద్ కర్నాటక వైకల్య సొసైటీ'ని స్థాపించి ఎంతోమందికి సేవలందించారు. ఆ సంస్థ కింద స్థాపించిన 'మాతోశ్రీ' స్కూల్లో చదివే పిల్లలందరూ వైకల్య బాధితులు మాత్రమే కాదు; ఆర్థికంగా కుదేలైన కుటుంబాల వారు.

'మా అమ్మ నాకు గొప్ప స్ఫూర్తి.. సమాజంలో నేను ఉన్నతంగా ఎదగాలంటే ఏం చేయాలో.. ఎలా ఉండాలో.. ప్రతి ఒక్కటీ నేర్పించింది. గొప్ప పట్టుదల ఉన్న మహిళగా ఆమె ఎప్పటికీ నాకు చెరగని జ్ఞాపకమే. అందుకే అమ్మ పేరుతోనే ఈ పాఠశాల స్థాపించాను' అంటూ తన తల్లి గొప్పతనాన్ని చెబుతారు దత్తు.

'2000 సంవత్సరం వరకు మా జిల్లాలో అంధ బాలికల కోసం ప్రత్యేక స్కూలు లేదు. నేను ప్రారంభించినప్పుడు కేవలం నలుగురే జాయినయ్యారు. గ్రామాలు తిరిగి అంధ బాలికలకు విద్య, వసతి కల్పిస్తామని చెప్పినా, ఎవరూ నమ్మలేదు. బాలికల రక్షణ పట్ల ఆ తల్లిదండ్రుల్లో విపరీతమైన భయాన్ని గమనించాను. పైగా విద్య వారి బతుకులను బాగు చేస్తుందని, అమ్మాయిలు చదువుకుంటే తమ కాళ్ల మీద తాము నిలబడగలిగే ఆత్మస్థైర్యాన్ని సంపాదించుకుంటారన్న అవగాహన లేని కుటుంబాలు వారివి' అంటూ స్కూలు ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు.



మొదట పిల్లల కోసం ఊళ్లు పట్టుకు తిరిగిన దత్తు స్కూల్లో, ప్రస్తుతం 75 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. కల్బుర్గి, బిడార్, యాదగిర్, రాయ్‌చూర్, కొప్పల్, బళ్ళారి జిల్లాల నుండి ఆ పిల్లలు వస్తున్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ 'స్థానికంగా స్కూళ్లు లేకపోవడం వల్లే పిల్లలు ఇంత దూరం వచ్చి చదువుకుంటున్నారు. భవిష్యత్తులోనైనా ఈ పరిస్థితి మారాలి. మరిన్ని పాఠశాలలు రావాలి' అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యతో పాటు ఆటలు, సంగీతం వంటి ఇతర అంశాలపై కూడా మాతోశ్రీలో బోధిస్తున్నారు.

అయితే, దత్తు ఇప్పుడు ఉద్యోగం నుంచి రిటైరయ్యారు. ఆయనకు జీతం ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. ఆ ప్రభావం ఈ స్కూలు నిర్వహణ మీద పడింది. దాంతో, ఈ స్కూల్లో ప్రస్తుతం కొత్త అడ్మిషన్లు తీసుకోవడం లేదు. 'రిటైర్ అవ్వడంతో నిధుల కొరతతో ఇబ్బందిగా ఉంది. ఇది చాలా బాధాకరమైన సమస్య." అని దత్తు చెబుతున్నప్పుడు ఆయన మాటల్లో తీవ్ర ఆవేదన విన్పించింది. దత్తు చేస్తున్న కృషికి దాతల సాయం అందాలని ఆశిద్దాం.

లాయర్‌ని అవుతా ...

నేను హైద్రాబాద్‌లో ఐ' క్యాంపుకు వెళ్లినప్పుడు దత్తు సార్ గురించి తెలిసింది. వెంటనే అమ్మానాన్న నన్ను ఇక్కడ చేర్పించారు. 7వ తరగతిలో నాకు సీటు వచ్చింది. ఇక్కడికి వచ్చాక ఇంటిని బాగా మిస్ అవుతున్నాను. అయినా నాకు ఇక్కడికి వచ్చాకే.. ఎంతో ధైర్యంగా, ఏదైనా సాధించాలన్న ఆశ కలిగింది. బాగా చదువుకుని లయర్‌ని అవుతాను. అమ్మానాన్నకు సాయంగా నిలుస్తాను.

- ఇద్మా, విద్యార్థిని

ఏ స్కూల్లోనూ చేర్చుకోలేదు

'నేను మదన్‌పురా నుంచి నాలుగేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాను. ఇక్కడికి రాకముందు ఏ స్కూల్లోనూ నన్ను చేర్పించుకోలేదు. డబ్బు పెట్టి ప్రైవేటు స్కూల్లో చేర్పించే స్థోమత మా తల్లిదండ్రులకు లేదు. ఇక్కడి టీచర్లు, సిబ్బంది మాకు బాగా సహకరిస్తారు.

- ముస్కాన్, ఐదో తరగతి



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68